

ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయనున్న అనకాపల్లి మండలం మార్టురు రహదారి

# ఏసీబీ వలలో తామరం వీఆర్వో

**మ్యుటేషన్‌కు రూ.15 వేలు డిమాండ్**

- డబ్బులు తీసుకుని బావమరిదికి ఇచ్చిన వీఆర్వో
- ఇద్దరినీ పట్టుకుని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు

మాకవరపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూమి పట్టాదారు పాస్‌పుస్తకం మ్యుటేషన్ చేసేందుకు రూ.15 వేలు లంచం తీసుకుంటూ తామరం వీఆర్‌వో పరవాడ లక్ష్మణరావు శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. తీసుకున్న నగదును వెంటనే పక్కన వున్న అతని బావమరిది కిరణ్‌కు ఇవ్వడంతో ఏసీబీ అధికారులు అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలిలా వున్నాయి.



లంచంతో పట్టుబడిన వీఆర్వో లక్ష్మణరావు

మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ఏడు ఎకరాల భూమి ఉంది. ఆయన ఇటీవల చనిపోవడంతో ముగ్గురు కుమారులు భూమిని తమ పేర్లపై మ్యుటేషన్ చేయించుకునేందుకు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. తామరం వీఆర్‌వో లక్ష్మణరావు భీమబోయినపాలెం గ్రామానికి ఇన్‌చార్జి వీఆర్‌వోగా వ్యవహరిస్తున్నారు. మ్యుటేషన్ దరఖాస్తు ఇతని వద్దకు వచ్చింది. భూమిని ముగ్గురు పేర్లు మీద మ్యుటేషన్ చేయాలంటే రూ.15 వేలు ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేశారు. దీంతో ముగ్గురు సోదరుల్లో ఒకరు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు ఆ వ్యక్తి శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో రూ.15 వేలు నగదుతో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వున్న వీఆర్‌వో లక్ష్మణరావుకు డబ్బులు ఇచ్చారు. ఆయన వెంటనే నగదును పక్కనే వున్న తన బావమరిది కిరణ్‌కు ఇచ్చారు. అనంతరం లక్ష్మణరావు కంప్యూటర్ ఆపరేటర్ రూమ్‌లోకి వెళ్లి విధులు నిర్వహిస్తుండగా అప్పటికే సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి వచ్చి వీఆర్వోను, అతడి బావమరిదిని అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తరువాత ఏసీబీ కోర్టుకు తరలించారు. సోదాల్లో ఈమెతోపాటు మరో డీఎస్పీ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలకు రోడ్డు

**50 మంది జనాభా దాటిన ప్రతి పల్లెకు రహదారి సదుపాయం**



సమావేశానికి హాజరైన అధికారులు

- అయా గ్రామాలను గుర్తించి, పనులు త్వరగా పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పలు శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష
- పల్లె పండుగ పనులు 15లోగా ప్రారంభించాలి
- సకాలంలో పూర్తిచేయకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరిక
- పేదల ఇళ్ల నిర్మాణాలను డిసెంబరులోగా పూర్తిచేయాలని ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 50 మంది పైబడి జనాభా గల ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డ్వామా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు-భవనాలు, జల వనరులు, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణం అవసరమైన గిరిజన గ్రామాలను, చేయాల్సిన పనులు గుర్తించి త్వరగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, లేకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మండల పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులను ఎంపీడీవోలు పర్యవేక్షించాలని, ఆయా పనులు పూర్తిచేసే బాధ్యత కూడా తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను నవంబరు 15వ తేదీ నాటికి నూరుశాతం ప్రారంభించాలని, డిసెంబరు 31వ తేదీ నాటికి 75 శాతం పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు మంజూరైన రూ.5.34 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లపై ఏర్పడిన గోతులను త్వరగా పూడ్చాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో కోటి 22 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 94 లక్షల 65 వేల పని దినాలు కల్పించారని, మిగిలిన పని దినాలను గడువులోగా కల్పించాలని ఆదేశించారు. జాబ్ కార్డు వున్న ప్రతి కుటుంబానికి ఏడాదిలో నూరు రోజులపాటు పని కల్పించాలని ఆమె స్పష్టం చేశారు.

పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నాటికి లక్ష గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంకాగా, అనకాపల్లి జిల్లాలో 6,067 గృహాలు వున్నాయని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు 1,692 ఇళ్లు మాత్ర మే పూర్తయ్యాయని, మిగిలిన 4,375 గృహాలను డిసెంబరు 31వ తేదీలోగా పూర్తి చేయాలని, ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను నిష్పక్షపాతం నిర్వహించాలని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా గణాంకాధికారి (సీపీఓ) జిరామారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, హౌసింగ్ పీడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

**రూ.103.5 కోట్ల ఉపాధి నిధులతో 1,197 సిమెంట్ రహదారులు నిర్మాణం**

- సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం

అనకాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయితీ రాజ్ శాఖ పరిధిలోని అన్ని రహదారులను జాతీయ ఉపాధి హామీ పథకం (కన్వర్జన్సీ) నిధులతో దశల వారీగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలను అనుసంధానం చేసేలా సిమెంట్ రోడ్లు నిర్మించడానికి కార్యచరణ ప్రణాళికను రూపొందించింది. రూ.103.5 కోట్లతో 1,197 సీసీ రోడ్లు వేయడానికి అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. మండల కేంద్రం నుంచి మారుమూల పల్లెలకు సిమెంట్ రోడ్లు వేస్తారు. పల్లెలకు అనుసంధానంగా ఉండే లింకు రోడ్లను కూడా నిర్మించనున్నారు. అంతేకాకుండా అధ్వానంగా ఉన్న రహదారులకు నిర్వహణ పనులు చేపట్టనున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచుకోని రోడ్లకు కూటమి ప్రభుత్వం హయాంలో మహర్దశ పట్టనున్నది. ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రతిపాదనల మేరకు పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి అధికారులు ప్రణాళికను అమలు చేయనున్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. వచ్చే సంక్రాంతి పండుగనాటికి గ్రామీణ రహదారులకు కొత్త రూపు తెవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ఉపాధి హామీ నిధులతో రోడ్ల నిర్మాణం పనులను వేగవంతం చేస్తున్నామని పంచాయతీ రాజ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు తెలిపారు.

# భారీగా ఇసుక సీజ్

**పాతరోడ్డు ప్రాంతంలో అధికారులు దాడులు**

- మూడుచోట్ల 70 ట్రాక్టర్ల ఇసుక స్వాధీనం

కోటవురట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతరోడ్డు ప్రాంతంలో ఇసుక అక్రమ నిల్వలపై రెవెన్యూ అధికారులు శుక్రవారం రాత్రి దాడులుచేశారు. మూడుచోట్ల నిల్వ చేసిన సుమారు 70 ట్రాక్టర్ల ఇసుకను గుర్తించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ తిరుమలరావు, ఆర్ఐ, వీఆర్వోలు శుక్రవారం గొట్టివాడ రీచ్‌ను పరిశీలించారు. అనంతరం పాతరోడ్డు ప్రాంతంలో నిల్వ చేసిన ఇసుక కుప్పలను గుర్తించారు. ఈ సందర్భంగా ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక విలువ సుమారు రూ.5 లక్షలు వుంటుందని అంచనా వేస్తున్నారు.



పాతరోడ్డు ప్రాంతంలో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

# ఉచిత ఇసుక పాలసీకి తూట్లు

**దార్లపూడి వద్ద వరహా నదిలో యథేచ్ఛగా తవ్వకాలు**

- పక్కనే ఉన్న తోటల్లో కుప్పలుగా నిల్వ
- ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా



దార్లపూడి వద్ద వరహా నదిలో టైరుబండ్లతో ఇసుక తవ్వకాలు

ఎస్.రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి వద్ద వరహా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానికంగా ఇళ్ల నిర్మాణం కోసం నదులు, గెడ్డల్లో ఎడ్ల బండ్లతో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును కొంతమంది వ్యక్తులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. నదిలో నుంచి పగటిపూట టైరు బండ్లతో ఇసుకను బయటకు తీసుకువచ్చి, సమీపంలోని తోటలు, ఖాళీ స్థలాల్లో కుప్పలుగా నిల్వ చేస్తున్నారు. చీకటిపడిన తరువాత ట్రాక్టర్లు, లారీల్లోకి లోడింగ్ చేసి, ఇసుక డిమాండ్ అధికంగా వున్న ప్రాంతాలకు రవాణా చేసి భారీగా సొమ్ములు గడిస్తున్నారు.

వాస్తవంగా ఎస్.రాయవరం మండలంలో అధికారికంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు. కానీ దార్లపూడి గ్రామం వద్ద వరహా నదిలో పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన టైరు బండ్ల యజమానులు, ఇసుక వ్యాపారులు కుమ్మక్కయ్యారు. సుమారు 70 టైరు బండ్లుతో పగటిపూట ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. వాస్తవంగా వీరెవరూ ఇసుక తవ్వకాల కోసం సచివాలయంలో అనుమతులు తీసుకోలేదు. తవ్వి తీసిన ఇసుకను నది పక్కన మామిడి తోటలు, ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. స్థానికంగా ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల చొప్పున విక్రయిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు అయితే రూ.6-7 వేలు వసూలు చేస్తున్నారు. ఇంతభారీ ఎత్తున ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతుంటే అధికారులెవరూ అటువైపు కన్నెత్తి అయినా చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా దార్లపూడి వద్ద వరహా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ జె.రమేశ్‌బాబును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, దార్లపూడి వద్ద వరహా నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పారు. ఎవరైనా ఇసుక తవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



దార్లపూడి వద్ద పోలవరం అక్విడక్టు సమీపంలో నిల్వచేసిన ఇసుక కుప్పలు

# గన్‌మెన్ లేకుండానే...

- పోలీస్ బదిలీల్లో తన సిఫారసులను పట్టించుకోలేదనే అసంతృప్తితో గత నెల గన్‌మెన్‌ను వెనక్కిపంపిన పెందుర్తి ఎమ్మెల్యే
- మళ్లీ పునరుద్ధరించేందుకు యత్నించని అధికారులు
- జనసేన నాయకుల అసంతృప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు గన్‌మెన్ లేకుండానే తిరుగుతున్నారు. ఆమధ్య జరిగిన పోలీస్ బదిలీల్లో తన సిఫారసులను పట్టించుకోలేదనే అసంతృప్తితో ఆయన గన్‌మెన్‌ను వెనక్కి పంపేశారు. బదిలీలకు సంబంధించి పంచకర్ల నుంచి పోలీసు అధికారులు మూడు సిఫారసు లేఖలు తీసుకున్నారు. నియోజకవర్గంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ స్టేషన్లకు ఒక్కో పేరు చొప్పున ఆయన మూడు పేర్లు ఇచ్చారు. అందులో ఒక్కటి కూడా ఉన్నతాధికారులు ఆమోదించలేదు. వేరే వారిని సీఐలుగా నియమించారు. ఇది అవమానంగా భావించిన పంచకర్ల వెంటనే తనకు గన్‌మెన్ అవసరం లేదని చెప్పి వెనక్కి పంపించేశారు. ఇది జరిగి సుమారు రెండు నెలలు అవుతోంది. కూటమిలో మిత్రపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం ఉండకూడదని ఆయన బదిలీల వ్యవహారంపై మౌనం దాలిస్తే గన్‌మెన్‌ను పునరుద్ధరించకుండా పోలీసు పెద్దలు చోద్యం చూస్తున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు.



# మంచినీటి సరఫరా బంద్

**పురుషోత్తపురం వద్ద పగిలిన పైప్‌లైన్**

- 17 పంచాయతీలు, ఎలమంచిలిలో సగం ప్రాంతానికి ఆగిన తాగునీటి సరఫరా
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు
- మునిసిపాలిటీలో ట్యాంకర్ల ద్వారా సరఫరా
- పైపులైన్‌కు మరమ్మతు పనులు.. నేటి సాయంత్రానికి పూర్తి!
- రేపటి నుంచి యథావిధిగా నీటి సరఫరా

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీలో సగం ప్రాంతంతోపాటు మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు శుక్రవారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఎస్.రాయవరం మండలం సోముదేవునిపల్లి వద్ద వరహా నది నుంచి నీటిని సరఫరా చేసే పైపులైన్ పురుషోత్తపురం వద్ద పగిలిపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని అధికారులు తెలిపారు.

ఎలమంచిలి మునిసిపాలిటీతోపాటు మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు తాగునీటి సరఫరా కోసం ఎస్.రాయవరం మండలం సోముదేవునిపల్లి వద్ద గతంలో మెగా వాటర్ స్కీమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి పైపులైను ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుంటారు. కాగా గురువారం రాత్రి మండలంలోని పురుషోత్తపురం వద్ద పైపులైను పగిలిపోయింది. ఈ విషయాన్ని అధికారులు శుక్రవారం ఉదయం గమనించారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టారు. పైపులైను పగిలిపోవడంతో శుక్రవారం ఉదయం కొళాయిలకు తాగునీటిని విడుదల చేయలేదు. పట్టణంలోని 4వ వార్డు నుంచి 8వ వార్డు వరకు, 11వ వార్డు నుంచి 14వ వార్డు వరకు,, 17, 18, 24, 25 వార్డులతోపాటు మండలంలోని అన్ని పంచాయతీలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. కానీ ఈ విషయాన్ని ప్రజలకు వెల్లడించకపోవడంతో తాగునీటి కోసం కొళాయిల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొంతసేపటి తరువాత పట్టణంలో ట్యాంకర్ల ద్వారా అరకొరగా తాగునీటిని సరఫరా చేశారు. పైపులైన్ మరమ్మతు పనులు శనివారం సాయంత్రానికి పూర్తవుతాయని, ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేడీ సత్యకుమార్ తెలిపారు.



పురుషోత్తపురం సమీపంలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు



బాలురు జట్ల మధ్య సాగుతున్న హాకీ పోటీ

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

- 13 జిల్లాల నుంచి తరలివచ్చిన జట్లు
- మూడు రోజుల పాటు నిర్వహణ

- 8లో



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

# సాంకేతిక నైపుణ్యంతో సైబర్ నేరాలకు చెక్

**భవిష్యత్తులో చోరీలకన్నా సైబర్ మోసాలే అధికంగా ఉంటాయి**

- బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చు
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల పోలీసు అధికారులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ నైపుణ్యం, మెలకువలతో సైబర్ మోసాలను సులువుగా చేదించవచ్చునని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో మెలకువలు, ఎప్పటికప్పుడు కొత్తగా తెలుసుకోవాల్సిన విషయాలు, నైపుణ్యం పెంపుపై అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ మోసాల కేసులు, సోషల్ మీడియా కేసుల దర్యాప్తునకు సంబంధించి ప్రత్యేక టూల్స్ ద్వారా కచ్చితమైన సమాచారాన్ని, నేరానికి పాల్పడిన ప్రదేశాన్ని గుర్తించవచ్చునన్నారు. దర్యాప్తునకు ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా సైబర్ నేరాలను త్వరగా కనిపెట్టి, కేసులను వేగంగా చేదించివచ్చని చెప్పారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే- సొమ్ము

... మిగతా 8వ పేజీలో

## వెల్చూరులో నూకాలమ్మ ఆలయం ప్రారంభం

▸ అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరులో నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. కాకినాడ శ్రీ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామివారి ఆధ్వర్యంలో వేదపండితుల బృందం అమ్మవారి ఆలయాన్ని ప్రారంభించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేద పండితులు హోమాలు నిర్వహించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అమ్మవారిని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తి రాజు, కూటమి నాయకులు డి.రంగనాయకులు, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, ధూళి నాగరాజు తదితర నేతలు పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, మాజీ సర్పంచ్ సిరిదెల్ల దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యులు రేబాక అనందరావు, నాయకులు కిల్లాడ చిన్న, శీరం రాంబాబు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### 11న ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన ఉచిత ఇసుక, భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునరుద్ధరణ హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 11వ తేదీన అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు కరపత్రాలను ఇక్కడ విడుదల చేసారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ రంగం అస్తవ్యస్తంగా మారిందని, ఈ ప్రభుత్వం హయాంలోనైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాపీ పనివారల సంఘం అధ్యక్షుడు ఆడారి శివ శంకర్, చలంశెట్టి శంకర్రావు, కె. శ్రీను, బి.రాము పాల్గొన్నారు.

### అనారోగ్యంతో పౌరాణిక కళాకారుడు సోమయ్య మృతి

రాంబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన పౌరాణిక కళాకారుడు సమ్మెట్ల సోమయ్య (65) శుక్రవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించినట్టు గ్రామస్థులు తెలిపారు. ఈయన పలు పౌరాణిక నాటకాల్లో రాముడు, కృష్ణుడు, నారదుడు పాత్రల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. సోమయ్య మరణం కళా రంగానికి తీరని లోటని కళాకారుల సమాఖ్య మండల నాయకులు డీవీ.సన్నయ్య, కె.అప్పారావు అన్నారు.

### డిగ్రీ కళాశాలలో ముగిసిన చెస్ కోచింగ్ క్యాంపు

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు డిగ్రీ కళాశాలలో మూడు రోజులుపాటు నిర్వహించిన ఉచిత చెస్ కోచింగ్ క్యాంపు శుక్రవారంతో ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టరు పోలిరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించే ఇంటర్ కళాశాలల చెస్ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు ఈ కోచింగ్ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కోచ్ సీహెచ్. స్రావంత్ పర్యవేక్షణలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారన్నారు.

## చేపల వలకు చిక్కిన కొండచిలువ



పొలిమేరమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో చిక్కిన కొండచిలువ

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కొత్తఎర్రవరం పొలిమేరమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం సాగునీటి కాలువలో చేపల వలకు 10 అడుగుల కొండచిలువ చిక్కింది. చేపల వల కాస్త బరువుగా ఉండడంతో చేపలు పట్టేవారంతా శ్రమించి వలను తీసి చూసేసరికి వలలో చేపలతో పాటు కొండచిలువ కూడా ఉండడంతో వీరంతా ఆందోళన చెందారు. ఈ విషయాన్ని స్థానికులు ద్వారా ఎలమంచిలి అటవీ అధికారులకు తెలియడంతో అటవీ శాఖ సెక్షన్ అధికారి బీవీ.రమణ తన సిబ్బందితో వెళ్లి కొండచిలువను పట్టుకుని అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

## ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



పాయకరావుపేటలో సభ్యత్వ నమోదు కార్డులు అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ముమ్మంగా చేపడుతున్నారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డు, కంటోన్మెంట్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు పలువురు కార్యకర్తలకు మంజూరైన సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మలిపెద్ది వెంకటరమణ, వేములపూడి అప్పారావు, జూరెడ్డి ప్రసాద్, మలిపెద్ది సతీశ్, దేవరపు మహాలక్ష్మి, పొన్నగింటి శ్రీను, జయప్రకాష్, పాతర్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

▸ స్పందన ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు

ఎస్.రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ప్రధాన ధ్యేయమని స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ బుచ్చిరాజు అన్నారు. మండలంలోని లింగరాజుపాలెం గ్రామంలో శుక్రవారం ఇటీవల కుట్టు శిక్షణ తరగతులకు పూర్తిచేసిన మహిళలకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు చేతుల మీదగా సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అనంతరం లింగరాజుపాలెంలో ఉచిత కుట్టు శిక్షణకు సంబంధించిన నూతన గ్రూపును ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చిరాజు మాట్లాడుతూ ఫౌండేషన్ స్థాపించి నాలుగేళ్లలో 380 మందికి మహిళలకు శిక్షణ వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలుఅల్లూరి వెంకట గోపాల కృష్ణంరాజు, దండు గణపతి రాజు, ఫౌండేషన్ ప్రతినిధులు కె.వెంకటరావు, ఝాన్సీ పాల్గొన్నారు.

## విద్యా వలంటీర్లకు శిక్షణ

ఎస్.రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్‌లో విద్యా వలంటీర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉల్లాస్ పథకం లక్ష్యాన్ని వివరించారు. నిరక్షరాస్యులకు రాయడం, చదవడం నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివప్రసాద్, సీసీలు పాల్గొన్నారు.

# అధ్వానంగా మునిసిపాలిటీ అంతర్గత రోడ్లు

▸ ఇబ్బందులు పడుతున్న ప్రజలు ▸ పట్టించుకోని మునిసిపల్ అధికారులు, పాలకులు



పట్టణంలోని గాంధీనగర్ రోడ్డు దుస్థితి

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లను కలిపే చోట గోతులు పడి ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అంతర్గత రోడ్లను అధికారులు, పాలకులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పట్టణంలో ప్రధానంగా గాంధీనగర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. కోర్టుపేట ప్రధాన రోడ్డు ప్రారంభంలోనూ, కొత్తపేట శివాలయం రోడ్డు, ఏఎస్ఆర్ కాలనీ రోడ్డు, రామ్‌నగర్‌లోని టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే రోడ్డు, కాకివానివీధి ప్రధాన రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా తయారయ్యాయి. ప్రజాప్రతినిధులు, ధనికులు నివాసం ఉంటున్న ప్రాంతాలపై ఉన్న శ్రద్ధ పేదలు నివాసం ఉండే ప్రాంతాలపై ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణంలో వ్యత్యాసం ఎందుకు చూపుతున్నారని పాలకుల తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. మునిసిపాలిటీలో కొన్ని వార్డులు అభివృద్ధి చెందిన విధంగా మిగిలిన వార్డులను ఎందుకు అభివృద్ధి పరచలేదని నిలదీస్తున్నారు. కొత్తపేటలోని శివాలయం వీధి ప్రధాన రోడ్డు అయితే మునిసిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి రోడ్డు పెక్కులు తేలిపోయి దర్శనమిస్తున్నా.. ఆధునికీకరణపై దృష్టి పెట్టిన పాపాన పోలేదు. రెండు చారిత్రాత్మక ఆలయాలు ఉన్న ఈ ప్రధాన రోడ్డును ఆధునికీకరణ చేసేందుకు పాలకులు, అధికారులు వివక్ష చూపుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రోడ్లపై ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని స్థితి నెలకొందని వారంటున్నారు. మునిసిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడి పట్టణంలోని అంతర్గత రోడ్ల ఆధునికీకరణపై శ్రద్ధ వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## మోసయ్యపేటలో పట్టపగలు వెలుగులు



పట్టపగలే వెలుగుతున్న వీధి లైట్లు

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోసయ్యపేటలో వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో వీధి దీపాలు లేక రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడేవారు. అంతే కాకుండా కుక్కలు భయంతో రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడేవారు. ఈ విషయమై అక్టోబరు 29న 'వీధి దీపాల నిర్వహణ ఇష్టారాజ్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు వేశారు. అంతవరకు బాగానే ఉంది. కాని వీధి లైట్లను ఆర్పే నాథులే లేకుండా పోయారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మోసయ్యపేటలో ఇప్పుడు వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విద్యుత్ వృథాతోపాటు కరెంట్ బిల్లు పంచాయతీకి అధికంగా వస్తుందని గ్రామస్థులు అంటున్నారు. రాత్రిపూట వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## జనసేనలో చేరిన దిబ్బపాలెం సర్పంచ్

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం) పంచాయతీ సర్పంచ్ దిగుమర్తి లక్ష్మీతోపాటు ఇద్దరు వార్డు మెంబర్లు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. గతంలో వీరు వైసీపీ తరఫున ఎన్నికయ్యారు. శాసనసభ ఎన్నికలకు ముందే దిబ్బపాలెం ఉప సర్పంచ్ రాజాన విజయ్ తమ అనుచరులతో తెలుగుదేశంలో చేరారు. ఇప్పుడు సర్పంచ్ లక్ష్మితో పాటు రెండో వార్డు మెంబరు గుర్రం సూరిబాబు, పదో వార్డు మెంబరు పినపెళ్ల లక్ష్మి జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు సమక్షంలో శుక్రవారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి శ్రీరామదాసు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రాజు, లాలం తాతారావు తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన దిబ్బపాలెం సర్పంచ్ దిగుమర్తి లక్ష్మి, వార్డు మెంబర్లు



జడ్.చింతువాలో టీడీపీ సభ్యత్వ నమోదును చేస్తున్న టీడీపీ నేతలు

## జడ్.చింతువాలో టీడీపీ సభ్యత్వ నమోదు

రాంబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని తెలుగు యువత మండల అధ్యక్షులు ఎరిపల్లి అజయ్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి ఎరిపల్లి చిట్టిబాబు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు జడ్.చింతువా పంచాయతీ తోటవీధిలో టీడీపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. గ్రామంలో ఇప్పటివరకు రెండు వందలకు పైగా సభ్యత్వాలు చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పనితీరుపై సభ్యులు అసంతృప్తి

▸ నక్కపల్లి మండల సర్వసభ్య సమావేశం




జగనన్న కాలనీ సమస్యలను ప్రస్తావిస్తున్న ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారుల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అనేక సమస్యలను ప్రస్తావించారు. ఉపమాక పంచాయతీ పరిధిలోజూట ఆరు గ్రామాల పరిధిలో జగనన్న కాలనీ ఇళ్లు ఇచ్చారని, శ్మశానవాటిక లేకపోవడంతో అనేక అనర్థాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని సర్పంచ్ ప్రగడ వీరబాబు చెప్పారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని, కాలనీలో వాసులను ఉపమాక పంచాయతీలో సభ్యులుగా, ఓటర్లుగా చేర్చాలని డిమాండ్ చేశారు. కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ నక్కపల్లి ఆస్పత్రి పనితీరు బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ ఛాంబర్ ఎక్కడ వుందో తెలియడం లేదని, కనీసం నేమ్ బోర్డు కూడా వుండడం లేదన్నారు. సదరం శిబిరం నక్కపల్లిలో ఏర్పాటు చేసినప్పుడు చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలు పరిష్కరించాలని వేంపాడు, పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యులు కుంచెమధు, మేరుగు నాగేశ్వరరావు కోరారు. పెదతీనార్ల పంచాయతీలో అక్రమ లే అవుట్లు వున్నా పట్టించకోలేదని సభ్యుడు నాగేశ్వరరావు ఆరోపించారు. చినతీనార్లలో ఇష్టానుసారం భూముల రికార్డులు మార్చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు వి.అప్పలస్వామి ఆరోపించారు. గొడిచెర్ల పీహెచ్‌సీ నుంచి ఒక్కసమావేశానికి కూడా డాక్టర్ రాలేదని, ఇలా ఎన్నాళ్లు చూస్తారని గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపాలని సూచించారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో డి.సీతారామరాజు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఏవో ఉమాప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కౌలు రైతులను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టొద్దు

లీడ్ బ్యాంకు మేజనేర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ... హాజరైన బ్యాంకు అధికారులు

కోటవురట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు బ్యాంకులు సకాలంలో రుణాలు ఇవ్వక పోవడంతో ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులు ఆశ్రయించి ఆర్థిక ఇదులు ఎదుర్కొంటున్నారని లీడ్ బ్యాంకు జిల్లా మేజనేర్ కె.సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నాతవరం, మాకవరపాలెం, ఎస్‌రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరుచేసి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సైబర్ నేరాలు బాగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, రైతులకు అవగాహన కల్పించడానికి నెలకు మూడు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన సూచించారు. డీఆర్‌డీవో డీపీఎం కుమారస్వామి మాట్లాడుతూ రుణాల మంజూరు అర్హతగల గ్రూపులు ఉంటే నేరుగా వెలుగు సీసీలను, ఏపీఎంలను సంప్రదించి మంజూరు చేయాలన్నారు. వీఏవోలు ద్వారా గ్రూపులు రుణాలు మంజూరు చేయవద్దన్నారు. డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసే రుణాలు విషయంలో వెలుగు ఏపీఎం, సీసీ ప్రమేయం లేకుండా చూడాలని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ముద్రరుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రూపు సభ్యులకు బ్యాంకు సేవింగ్స్ బట్టి కాకుండా వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో కోటవురట్ల స్టేట్‌బ్యాంకు మేనేజర్ సోమశేఖర్, మాకవరపాలెం మేనేజర్ చంద్రశేఖర్, పలు మండలాల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా చేప పిల్లలు పడితే చర్యలు

▸ మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.ప్రసాద్



పెంటకోటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న జేడీ ప్రసాద్

పాయకరావుపేట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా చేప పిల్లలను పట్టి ఎగుమతి చేస్తే చర్యలు తప్పవని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన మత్స్యకారులు కొంతమంది తాండవ నది, సముద్రం కలిసే చోట చేప పిల్లలను పట్టుకుని ఎగుమతి చేస్తున్నారని, దీని కారణంగా మత్స్య సంపద తగ్గిపోయి చేపల వేట ఆధారంగా చేసుకుని జీవిస్తున్న సుమారు వంద కుటుంబాల వారు ఉపాధి కోల్పోతున్నారని గ్రామానికి చెందిన మచ్చ అప్పలరాజు, జి.అనిల్‌కుమార్, జి.కామేశ్వరరావు, గేదెల అప్పలరాజు, తదితర మత్స్యకారులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం జేడీ ప్రసాద్ గ్రామంలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించి విచారణ చేపట్టారు. చేప పిల్లలు పట్టుకుని ఎగుమతి చేయడం నిబంధనలకు విరుద్ధమని, వెంటనే ఆపకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ జాస్మిన్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, మత్స్య శాఖ సిబ్బంది విజయ్‌శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎలమంచిలి తహసీల్దారు వరహాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం ప్రతినిధి రవిబాబు మాట్లాడుతూ.. 104 వైద్య సేవలను పీహెచ్‌సీ మెడికల్ అధికారి ద్వారా వైద్య సేవలు అందించాలని కోరారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని తదితర సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంయూ స్టాఫ్ రాజాబాబు, మణికంఠ పాల్గొన్నారు.

### 'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'



పంచదార్ల సంపద కేంద్రంలో వానపాములు వేస్తున్న ఈవోపీఆర్డీ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు దిన్‌బాబు

రాంబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఈవోపీఆర్‌డీ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు అన్నారు. శుక్రవారం పంచదార్లలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ ఈకో ఎంటర్‌ప్రైజెస్ అధినేత జి.రవికుమార్ అందించిన వానపాములును సేంద్రియ ఎరువు తయారీకి ఏర్పాటు చేసిన తొట్టెల్లో వారు వేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### సమస్యలపై సీపీఎం ప్రజాపోరు

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 15వ తేదీ వరకు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీపీఎం నాయకులు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం తిమ్మరాజుపేటలో ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. గత ఐదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవటంతో పాటు నిరుద్యోగ సమస్య కూడా భారీ పెరిగిపోయిందన్నారు. ఈకార్యక్రమంలో నాయకుటు కర్రి అప్పారావు, రొంగలి రాము, ఎస్.రామునానాయుడు, ఎన్.సన్యాసిరావు. కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గొట్టివాడలో ఉచిత ఇసుక పక్కదారి

మాజీ ఎమ్మెల్సీ డీవిసూర్యనారాయణరాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

కోటవురట్ల, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): గొట్టివాడ వరహానదిలో అనుమతులు ముసుగులో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నదని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు ఆరోపించారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టడం మంచిదేగాని, దీని పుణ్యమాని గొట్టివాడ వరహానదిలో కొందరు బడాబాబులు ఇసుక వ్యాపారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసి పంటపొలాల్లో నిల్వలు చేసి, రాత్రులు పట్టణాలకు లారీలపై ఎగుమతి చేస్తున్నారని, లారీ ఇసుక రూ.20 వేల చొప్పున వసూలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

## విద్యార్థులకు ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన ఉండాలి

కేఎల్.యూనివర్సిటీ ప్రొఫెసర్ మాధవరావు

పాయకరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కేఎల్.యూనివర్సిటీ(విజయవాడ) అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ చుండూరు మాధవరావు తెలిపారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కృత్రిమ మేధపై జరుగనున్న వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి వక్తలుగా విచ్చేసిన ప్రొఫెసర్ మాధవరావు మాట్లాడుతూ కంప్యూటర్ కోర్స్ చదువుకున్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఏఐ ఆధారిత పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మెరుగైన విశ్లేషణాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్వర్కింగ్ అవకాశాలు పెంపొందించుకోవచ్చని చెప్పారు. అనంతరం రీజనల్ మేనేజర్ ఆఫ్ అకడమిక్స్ వై.శివప్రసాద్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

### చలో అమరావతిని జయప్రదం చేయాలి

పాయకరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ-క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా డిసెంబర్ 19న చేపడుతున్న చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వి.కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. స్థానిక డీబీపీ కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలను రద్దుచేయడానికి క్రిమిలేయర్ విధానంను తీసుకొచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో డీబీపీ నాయకులు దాసరి అన్నపూర్ణ, దువ్వాడ దావీదు, మాల మహానాడు ప్రతినిధి బి.రమణబాబు, ప్రధాన కార్యదర్శి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

## బిందుసేద్యం పరికరాలు పొందండి: కొణతాల



పరికరాలు తీసుకొచ్చిన వాహనానికి పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఉద్యానవన శాఖలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటిపారుదల ప్రాజెక్టు పరికరాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలకు మొదటిసారిగా పరికరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ఇచ్చే రాయితీతో బిందుసేద్యం పరికరాలు పొందాలని కోరారు. అనంతరం ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పరికరాలతో ఆర్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ లక్ష్మి, రంజిత, కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవ గోడప్రతి ఆవిష్కరణ



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ 11వ వార్షికోత్సవ గోడప్రతిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 11 నుంచి 15 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. లంకెలపాలెం పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు పచ్చికోరు రమణమూర్తి, ఎం.రమేష్‌నాయుడు, వాసు పాల్గొన్నారు.

## 15న సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరిపాక చెరుకు కాటా వద్ద గల సాయిబాబా ఆలయం 13వ వార్షికోత్సవం ఈ నెల 15న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ధర్మకర్త మల్ల కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ప్రచార పోస్టరును ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు కోలాటం పోటీలు, మధ్యాహ్నం అన్న సమారాధన ,సాయంత్రం దీపోత్సవం, స్వామివారికి హారతి, అనంతరం బాబా ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నర్సింగబిల్లిలో సినిమా షూటింగ్ ప్రారంభం



నూకాంబిక ఆలయంలో క్లాప్ కొడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నర్సింగబిల్లిలో తపస్వి ఆర్ట్ క్రియేషన్ "ప్రొడక్షన్ నెంబర్ 1" బ్యానర్‌లో నిర్మిస్తున్న నూతన సినిమా చిత్రీకరణకు రాష్ట్ర పట్టణ ప్రాంత మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ముహూర్తం క్లాప్స్ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ అనిల్‌కుమార్ పల్లా, ప్రొడ్యూసర్ పల్లా సౌమ్య చాందినిలు నిర్మిస్తున్న ఈ సినిమాలో నూతన నటులు హీరో పల్లా నాగు, హీరోయిన్ ఆధ్యా రెడ్డి నటిస్తున్నారన్నారు. చిత్రీకరణ విజయవంతంగా ముగిసి సినిమా జనాదరణ పొందాలని ఆకాంక్షించారు. ముందుగా నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, భర్నికాన సాయినాథ్, పల్లా తాతారావు, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీ, గ్రామ సర్పంచ్ అరుణ పాల్గొన్నారు.

## రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి: కార్పొరేటర్ రౌతు

లంకెలపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వార్డు పరిధిలో సీసీ రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. లంకెలపాలెం పరిసర ప్రాంత కాలనీల్లో శుక్రవా రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో డ్రైనేజీలు లేక వీధుల్లో నిలిచిపోయిన మురుగు నీటిని పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు టీడీపీ నాయకులు నాయుడు, కోటేశ్వరరావు, జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఉన్నారు.

## వానపాముల తయారీపై అవగాహన

కశింకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాల్లో వానపాముల తయారీకి, చెత్త నుంచి సంపద తయారీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూటమి నేతలు మళ్ల వెంకటరమణ (బాబు), మళ్ళ సూర్యారావు, పప్పల అప్పారావు, బోదెపు గోపి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గొబ్బూరు గ్రామంలో రైతులకు, గ్రామస్తులకు వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గ, వీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా పనిచేయాలి: వైసీపీ

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ బలపరిచిన నీటి సంఘాల ఎన్నికల అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల రమణరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. కె. కుశ్వంత్, సత్యానంద్, నవనీత్‌లు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల కోచ్ డైరెక్టర్ జి. మధుబాబు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్, కోచ్ రాజేష్ విద్యార్థులను అభినందించారు.

# పేరులోనే మధురం.. తీరు ఘోరం

**అస్తవ్యస్తంగా డ్రైనేజి వ్యవస్థ**

- రోడ్లపైనే మురుగు పరుగు...
- అవస్థలు పడుతున్న కాలనీవాసులు



మధురానగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు



అధ్వానంగా దర్శనమిస్తున్న డ్రైనేజీ

తుమ్మపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ తుమ్మపాల మధురానగర్‌లో రహదారులపై మురుగు నెలల తరబడి తిష్ఠ వేసింది. ఏ మూలన చూసినా మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. పలుచోట్ల డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో డ్రైన్ల నుంచి మురుగు ప్రవహించక రోడ్ల పైకి చేరుతోంది. కాలనీలోని పలువీధుల్లో అసలు డ్రైనేజి వ్యవస్థ లేక వాడుకనీరు రోడ్లపైకి చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. తుమ్మపాల పంచాయతీ శివారు మధురానగర్‌లో దాదాపు వంద కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. అత్యధిక పన్నులు ఈ ప్రాంతం నుంచే తుమ్మపాల పంచాయతీకి చేరుతున్నాయి. అయితే అనకాపల్లి పట్టణం, తుమ్మపాల పంచాయతీకి మధురానగర్ సరిహద్దు ప్రాంతం కావడంతో జీవీఎంసీ గాని, పంచాయతీ గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. తుమ్మపాల పంచాయతీకి క్రమంగా పన్ను చెల్లిస్తున్నప్పటికీ మధురానగర్ పై నాయకులు, అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి రోడ్లపై మురుగు నిలిచిపోతుండడంతో దోమలు ప్రబలి స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ కంటిమీద కునుకు లేక నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపై రాకపోకలు సాగించేవారు మడమలోతు మురుగులోంచే రాకపోకలు సాగించే దుస్థితి దాపురించింది. దుర్వాసన వెదజల్లుతుండడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతంపై ఉదాసీనంగా వ్యవహరించడంతో అభివృద్ధికి నోచుకోలేదు. టీడీపీ హయాంలో శత శాతం సీసీ రోడ్లు ఈ ప్రాంతంలో నిర్మించినప్పటికీ డ్రైన్ల నిర్మాణం చేపట్టే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి మధురానగర్ అభివృద్ధికి దూరమైంది. ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూసే నాయకులు కరువయ్యారు. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ఈ ప్రాంతవాసులు అధికారులకు వినతిపత్రాలు, ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మధురానగర్ పై దృష్టి సారించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు**



మధురానగర్‌లో మురుగు సమస్యపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. పన్నుల వసూళ్లపై పంచాయతీ సిబ్బందికి ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేకపోవడం దారుణం. మురుగు కారణంగా ఈ ప్రాంతవాసులంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. తక్షణమే మధురానగర్‌లో డ్రైన్లు నిర్మించి మురుగు సమస్య పరిష్కరించాలి.

- గోకివాడ శ్రీరాములు, మధురానగర్

## కొత్తూరు-రాజుపాలెం రహదారి విస్తరణపై సర్వే



సర్వే అధికారులకు సమస్యలు వివరిస్తున్న రైతులు

అనకాపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 80వ వార్డు పరిధి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కొత్తూరు నుంచి రాజుపాలెం గ్రామానికి వెళ్లే రహదారి విస్తరణ కోసం శుక్రవారం రెవెన్యూ, రైల్వే శాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. ఇందులో భాగంగా అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా, డీటీ శ్రీరామ్మూర్తి రహదారి విస్తరణ కోసం సర్వే చేయించారు. ఈ విషయాన్ని గ్రహించిన గ్రామస్థులు, రైతులు ఇక్కడకు చేరుకుని పలు అభ్యంతరాలు తెలియజేశారు. గ్రామస్థుల డిమాండ్లు, రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని సర్వే చేపట్టాలని ఆర్డీవోను కోరారు. సర్వేకు సహకరించి, డిమాండ్లను లిఖితపూర్వకంగా రాసి ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో వారితో అన్నారు. రైతుల ప్రతీ అభ్యంతరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## 'ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న 'ఉల్లాస్' (అడల్ట్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీడీవో పద్మజ అధ్యక్షతన శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంపై ఎంపిక చేసిన వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ 15 ఏళ్లు దాటిన, చదువు మధ్యలో మానేసిన మహిళలను గుర్తించి వారికి రోజూ సాయంత్రం 6 గంటలకు లేదా అనువైన సమయంలో వలంటీర్లు గంట పాటు చదువు నేర్పాలని సూచించారు. వారికి అవసరమైన పెన్నులు, పుస్తకాలు, ఇతర సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద, వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, పలువురు సీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



గవరపాలెంలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

## అనకాపల్లి నియోజకవర్గంలో జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు పండుగలా సాగుతోంది. శుక్రవారం పట్టణంలోని జీవీఎంసీ 81వ వార్డులోని వేగి వీధి, చినహైస్కూల్ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. పట్టణ ఆర్థిక సంస్థ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబులు మాట్లాడుతూ దేశంలోని ఎక్కడా లేని విధంగా రూ. 100లకే రూ. ఐదు లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో 30 వేల సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులు కార్యకర్తలకు విద్య, వైద్యంలో అండగా నిలుస్తున్నారన్నారు. ప్రతీ కార్యకర్త తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, మారిశెట్టి శంకరరావు, వేగి కృష్ణ, బెల్లాన శ్రీనివాసరావు పాల్గొన్నారు

# నిధులన్నీ కొందరికేనా?!

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- నిధుల విడుదలపై శ్వేతపత్రానికి డిమాండ్
- 'ఆడుదాం ఆంధ్ర' బిల్లుల చెల్లింపుపై అభ్యంతరం
- పక్కనపెట్టిన అంశాన్ని మళ్లీ ఎజెండాలో చేర్చడమేమిటంటూ సభ్యుల నిలదీత
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదు
- వాడిగా వేడిగా స్టాండింగ్ కమిటీ సమావేశం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్య క్షతన శుక్రవారం జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో జరిగిన స్థాయీ సంఘం సమావేశం గతానికి భిన్నంగా వాడీవేడిగా సాగింది. జోన్-6లో 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం, ముగింపు వేడుకలకు చేసిన ఖర్చుల చెల్లింపు గురించి ఎజెండాలో పేర్కొన్న మొదటి అంశం చదువుతుండగానే సభ్యులు పలువురు తమ వ్యతిరేకత వ్యక్తంచేశారు. గత సమావేశంలో ఇదే అంశాన్ని వాయిదా వేశామని, ఆధారాలు సమర్పించాలని కోరినప్పటికీ, అలాంటివేమీ లేకుండా తిరిగి ఎజెండాలో చేర్చడమేమిటని ప్రశ్నించారు. అంతేగాకుండా స్టాండింగ్ కమిటీ ఎజెండాను ఒకరోజు ముందు ఇవ్వడాన్ని తప్పు బట్టారు. తమను కార్యదర్శి పి.వి.రమణ పట్టించుకోవడం లేదని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. తాము ఎజెండాలో చేర్చాలని ఇచ్చిన విజ్ఞప్తులను పక్కనపెట్టి ఎవరో ఇచ్చిన వాటిని చేర్చడం ఏమిటంటూ నిలదీశారు. 96వ వార్డు కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు వార్డులకే కోట్లాది రూపాయలు పనులు మంజూరుచేయడం సరికాదని మరికొందరు అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులకు కనీస గౌరవం లేదని గల్లా పోలిపల్లి ఆవేదన వ్యక్తంచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ నలుగురు దోచుకున్నట్టే...ఇప్పుడు మరో నలుగురు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోవాలా?...అని ప్రశ్నించారు. ఏఏ వార్డుకు ఎంతెంత నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని మేయర్‌ను కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యులమైనా కూడా ఎలాంటి అధికారాలు లేకుండా పోయాయని, ఇతర కార్పొరేటర్‌లకు, ప్రజలకు కూడా సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోయారు. జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపినట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎజెండాలో 71 అంశాలు పొందుపరచగా, వాటిపై సభ్యులు చర్చించిన పిదప 11 అంశాలు వాయిదా వేశామని, మిగిలిన 60 అంశాలు ఆమోదం పొందాయని పేర్కొన్నారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.17.5 కోట్లు అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఆరో జోన్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీర్లు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాలేవీ?



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. శుక్రవారం దొడ్డి రామునాయుడు భవనంలో సీపీఎం అనకాపల్లి మండల మహాసభ బి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లిలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను అభివృద్ధిపరచాలన్నారు. పట్టణంలో డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం పెన్షన్లు అమలు చేసి, దీపం పథకంలో కొద్దిమందికి మాత్రమే లబ్ధి కలిగించారని అన్నారు. సమావేశంలో నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, కె.తేలయ్యబాబు, భీశెట్టి అప్పారావు, జి. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## వరిలో రసాయన ఎరువులు వాడొద్దు

కొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం సీతానగరంలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారులు జ్యోతిమోహన్, రమేశ్ రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. వరి పూతదశలో ఉన్నందున ఎటువంటి రసాయన ఎరువులు వాడవద్దన్నారు. తగిన నీటితడులు అందజేయాలని సూచించారు. రైతులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ వారు ఇచ్చే ధ్రువపత్రం ద్వారా అధిక ధరకు రైతులు ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. ఓఎన్‌డీసీ లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో కూడా వరి ధాన్యాన్ని అధిక ధరకు విక్రయించుకోవచ్చని వివరించారు. రైతులు పొలమరశెట్టి గోవిందరాజు, సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పరికరాల పంపిణీ

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉడ్‌పేటలోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం సంఘ వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్ ముగ్గురు దివ్యాంగులకు పరికరాలు అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## పందివానిపాలెంలో స్వచ్ఛత హి సేవ



చెత్త ఊడ్చుతున్న మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెంలో శుక్రవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేహెచ్‌వీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, స్థానిక వార్డు సభ్యులు ముత్యాలు, నాగరాజు, అప్పలరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



టెక్కలిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రశ్నించడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తోందని పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ తెలిపారు. మండల పరిధి ఏడుమెట్ల మ్రరిపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. అపరిష్కృత సమస్యలపై రైతులు గ్రామసభలో అర్జీలు చేసుకుంటే వాటిని పరిశీలించి 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. వివిధ సమస్యలపై వందకు పైగా రైతులు దరఖాస్తులు అందజేశారు. ఏడుమెట్ల మ్రరిపాలెం రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూములు, వాగులకు సంబంధించినవి, కొండ పోరంబోకు భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆర్‌టీఐ కార్యకర్త చిప్పాడ రామారావు గ్రామసభలో విన్నవించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్ స్థానిక వీఆర్‌ఓ, రైతులు పాల్గొన్నారు.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ సూచించారు. టెక్కలిపాలెంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన రైతుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలిపాలెంలో మొత్తం 739 ఖాతా నెంబర్లు, 795.93 ఎకరాల భూమి ఉన్నాయన్నారు. రీ సర్వే తరువాత 3,678 ఎల్‌పీఎం నెంబర్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూమి 266.73 ఎకరాలు, జిరాయితీ 529.20 ఎకరాలు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొంప నాయనప్ప, గ్రామ పెద్దలు పైల రమణ, పంచాడ శ్రీను, డీటీ వై.గణేష్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, ఇందిర, వీఆర్వోలు కామరాజు, ఎం గోవిందరావు, డి ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

**594 దరఖాస్తుల స్వీకరణ**

కశింకోట: మండలంలో రీ సర్వే, గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. ఉగ్గినపాలెం, కొత్తపల్లిబుచ్చెయ్యపేటల్లో రెవెన్యూ గ్రామసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రైతుల నుంచి 594 దరఖాస్తులు స్వీకరించారు. భూముల విస్తీర్ణంలో మార్పులు, ఆన్‌లైన్‌లో నమోదు తదితర వాటిపై దరఖాస్తులు అందాయని రీ సర్వే డీటీ భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు తెలిపారు. గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన వారికి భూ విస్తీర్ణంలో ఎటువంటి తప్పులు జరిగినా ఈ సభల్లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వీఆర్‌వో ఉదయ్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, మాజీ సర్పంచ్ కలగ సోమేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కలగ పార్వతి, కరణం రమణ, గొంతిన ఈశ్వరరావు, కలగ గోవింద పాల్గొన్నారు.

## ఎట్టకేలకు జీకేవీధి సీఐ పోస్టు భర్తీ



బాధ్యతలు స్వీకరించిన వరప్రసాద్

గూడెంకొత్తవీధి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టును ఉన్నతాధికారులు ఎట్టకేలకు భర్తీ చేశారు. శుక్రవారం పి. వరప్రసాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజా బదిలీల్లో ఆగస్టు 28న ఇక్కడ పనిచేస్తున్న సీఐ అప్పలనాయుడు బదిలీ అయ్యారు. నాటి నుంచి రెండు నెలలపాటు సీఐ పోస్టు ఖాళీగావున్నది. ఐదుగురు సీఐలను నియమించినా ఏ ఒక్కరూ విధుల్లో చేరలేదు. దీంతో శుక్రవారం 'జీకేవీధి సీఐ పోస్టు భర్తీ అయ్యేనా?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. తాజాగా నియమితులైన సీఐ వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈమేరకు విజయవాడలో సైబర్ క్రైమ్ విభాగంలో పనిచేస్తూ బదిలీపై వచ్చిన వరప్రసాద్ విధుల్లో చేరారు.

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో గంగమ్మతల్లి ఆలయ గర్భగుడి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వారి ఆర్థిక సాయంతో పాటుదాతలసహకారంతో గర్భగుడి నిర్మాణం చేపడుతున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.రమేశ్, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, గ్రామ పెద్దలు శంకరరావు, నీలకంఠం, ధర్మారావు, గణపతి, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలని జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు కోరారు. శుక్రవారం చిన్నగెడ్డ గ్రామంలో పార్టీ నాయకులు ఉపాధి పనులు చేపడుతున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగాబుజ్జిబాబు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆగస్టు 23న గ్రామ సభలను ఏర్పాటు చేసి 83రకాల పనులను గుర్తించారన్నారు. ఈపనుల ద్వారా కూలి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ కార్డులులేని గిరిజనులకు వెంటనేమంజూరు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కిముడు కృష్ణమూర్తి, గాజుల శ్రీను, చంటి పాల్గొన్నారు.

## 13న జాబ్‌మేళా

అరకులోయ, 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ వద్ద ఈనెల 13న మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ రోహిణి తెలిపారు. ఈ జాబ్‌మేళాలలోని పారడైస్ ఫుడ్‌కోర్ట్, స్మాప్ సొల్యూషన్స్, మెడిప్లస్, పీవీఆర్ ఐనాక్స్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ ఆపై చదువుకున్న నిరుద్యోగులు, తమ స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్, పాన్‌కార్డులతో హాజరు కావాలని కోరారు.

## సీపీఎం మండల కార్యదర్శిగా పోతురాజు

డుంబ్రిగుడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్‌బీ పోతురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో పార్టీ 8వ మహసభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనర్స, ఉమమహేశ్వరావు ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. అందులో పోతురాజు మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు సూర్యనారాయణ, సురేశ్‌కుమార్, రాంచందర్, అచ్చమ్మను ఎన్నుకున్నారు. ఈసం దర్భంగా పోతురాజు మాట్లాడుతూ మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పాఠశాల ఆవరణంలో పరిశుభ్రం చేస్తున్న, ఈవోపీఆర్డీ, సర్పంచ్, తదితరులు

అనంతగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో ఈవోపీఆర్డీ లాలం సీతయ్య ఆధ్వర్యంలో శు క్రవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేశారు. చెత్తను సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈవోపీఆర్డీ లాలం సీత య్య మాట్లాడుతూ.. ప్రతి గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచేలా కార్యదర్శులు కృషిచేయాలని సూచించారు. పరిసరాల పరిశు భ్రతతో ఆరోగ్యం సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలోని సర్పంచు సారా సీతయ్య, కార్యదర్శి వరలక్ష్మి, మహిళా పోలీసు లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# వినతులతో వేసారి.. శ్రమదానంతో రాదారి

- జర్రెలపాదర్‌కు తాత్కాలిక రహదారి నిర్మాణం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు.. గ్రామస్థులు సమష్టిగా పనులు



బండరాయిని తొలగిస్తున్న యువకులు



శ్రమదానం చేస్తున్న గ్రామస్థులు

ముంచంగిపుట్టు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ జర్రెలపొదర్ గ్రామస్థులు శుక్రవారం శ్రమదానంతో తాత్కాలిక రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేక రాకపోకలకు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో తామే సమష్టిగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు గ్రామస్థులు వి.కళ్యాణ్, వి.గోపాల్, కె.జయరాం, వి.మస్య, కెదశరద్, కె.సురేష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. డుమడగూడ ప్రధాన రహదారి నుంచి జర్రెలపొదర్ వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని కొన్నేళ్లుగా కలెక్టర్లకు, ఐటీడీఏ పీవోలకు, మండల స్థాయి అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వేడుకున్నామన్నారు. అయితే, అధికారులు బదిలీలపై వెళ్లిపోతున్నారని, ప్రజా ప్రనిధులు పదవీ కాలం ముగిసిపోతుందని తమ సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రహదారిలేక చిన్నపాటి రోగం వచ్చినా, గర్భిణులను డోలీలతో ఆస్పత్రులకు తరలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న గృహ నిర్మాణాలకు సామాగ్రి తరలించేందుకు సైతం సమస్య ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. దీంతో ఈ స్థితిలో సుమారు 5 కిలోమీటర్ల మేర తాత్కాలిక మట్టి రహదారిని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

## గిరి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ తనుజారాణి

ముంచంగిపుట్టు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ గెలుపునకు కృషి చేసిన వైసీపీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని అరకు ఎంపీ డాక్టర్ తనుజరాణి అన్నారు. స్థానిక కళ్యాణమండపంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభ రవిబాబులను పార్టీ శ్రేణులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్ని పార్టీలు జతకట్టినా గిరిజన ప్రాంతంలో వైసీపీ కంచుకోటను ఎవరూ తాకలేరన్నారు. అనంతరం ఎమ్మెలే మత్స్యలింగం మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన కార్యకర్తల రుణపడి ఉంటానన్నారు. అలాగే జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ వైసీపీ బలోపేతానికి కార్యకర్తల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమవతి, ఎంపీపీ ఎ. సీతమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

పెదబయలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని ఆయన శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించారు. ముందుగా గురుకుల, ఏకలవ్య పాఠశాలలను తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, నేతలు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు పూరిల్లు దగ్ధం

కొయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ) : మండలంలోని ఆడాకుల పంచాయతీ కన్నంపేటగ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఘంట సోములమ్మకు చెందిన పూరిల్లు కాలి బూడిదయింది. కట్టుబట్టలతో మిగిలిన బాధితురాలిని ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని గ్రామస్థులుకోరారు.

## గిరిజనులకు ఆర్థిక సాయం

సీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ఎ. ధారకొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు రూ. 12,500 హుకుంపేట మండలం బాకూరు కాంప్లెక్స్‌కు చెందిన ఉపాధ్యాయులు సాయంగా అందించారు. సెప్టెంబరు 8 వతేదీన వచ్చిన భారీ తుఫాన్‌కు గ్రామంలో నష్టపోయిన గిరిజనులను గుర్తించి వారు ఈ ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకూరి కోటి, నేగం వెంకటరమణ పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

అనంతగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అరకువేలిలో ఈనెల 17న జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు తెలిపారు. శుక్రవారం మండలంలోని శివలింగపురం గిరిజన సం క్షేమ పాఠశాల ఆవరణలో ఆయ న మాట్లాడారు.. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వే గవంతం చేయాలని, యూనియన్ బలపరిచే ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఉమ్మడి జిల్లాల పూర్వసహా అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి సింహాచలం, కార్యవర్గ సభ్యులు కొండబాబు పాల్గొన్నారు.

## నాక్ బృందం పర్యటన విజయవంతం




నాక్ బృందంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాడేరురూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో నాక్ పీర్ బృందం రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసింది. శుక్రవారం క్యాంటీన్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు, కళాశాల కార్యాలయం, ఎన్ఎస్ఎస్‌లో ఉన్న రెగ్యులర్ కార్యక్రమాలు, స్పెషల్ క్యాంప్‌లను పరిశీలించారు. కళాశాలలో జిమ్‌ను పరిశీలించి ఫిజికల్ డైరెక్టర్‌కు పలు సూచనలు చేశారు. ప్రాంగణంలో ఉన్న గార్డెన్, మెడిసిన్ ప్లాంటేషన్, వర్మీ కంపోస్టు, నైపుణ్యాభివృద్ధి ల్యాబ్, జవహర్ నాలెడ్జ్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. కళాశాలలో ఉన్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల పర్యటనలో తాము గుర్తించిన అంశాలతో రూపొందించిన నివేదికను కళాశాల అధ్యక్షులకు, మరియూ ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ వి.కోటేశ్వరరావుకు అందించారు. అధ్యాపకులు, సిబ్బందితో ముగింపు సమావేశాన్ని నిర్వహించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. ప్రాంగణంలో పండ్ల మొక్కలను నాటారు. విద్యార్థులు కరతాల ధ్వనులతో బృంద సభ్యులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఏన్.రసూల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సీలేరులో వినియోగంలోకి వచ్చిన నాలుగో యూనిట్



జలవిద్యుత్ కేంద్రంలో వినియోగంలోకి వచ్చిన యూనిట్

సీలేరు, నవంబరు 8 , (ఆంధ్రజ్యోతి): సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ వినియోగంలోకి వచ్చినుట్టు ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శు క్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 60 మెగావాట్ల సామర్థ్యం గల నాల్గవ యూనిట్ బ్రేకర్ ఆగ్జలరీ స్విచ్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలతో రెండు రోజుల క్రితం ఉత్పత్తి నిలిచి పోయిందన్నారు. హైదరాబాద్ నుంచి ఈ స్విచ్‌ను రప్పించి అమర్చి యూనిట్‌ను శుక్రవారం నుంచి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. లోడ్ డిస్పాచ్ అధికార్ల ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఈఈ వివరించారు.

## గ్రోత్ మ్యానటరింగ్ తప్పనిసరి: సీడీపీవో



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల్లో చిన్నారుల గ్రోత్ మ్యానటరింగ్ తప్పనిసరి అని స్థానిక సీడీపీవో విజయకుమారి సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని శుక్రవారం పలు అంగన్‌వాడీల కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తక్కువ బరువు కలిగిన పిల్లలను గుర్తించి తగిన పోషణ కలిగిన పదార్థాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్ కేంద్రాలకు గ్రోత్ పరికరాలు అందించారు. కేంద్రాలలో నేమ్ బోర్డులతో పాటు టోల్ ఫ్రీ నంబర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి వీవోఏల సమస్య



ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందిస్తున్న వీవోఏలు

ముంచంగిపుట్టు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కారం జరిగే విధంగా కృషి చేయాలని కోరుతూ వివోఏలు శుక్రవారం ఎంపీ తనుజారాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలకు వినతి పత్రాలను అందించారు. డిమాండ్ల సాధనపై గత మూడు రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వివోఏలు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు శంకరరావు, భీమరాజు, గిరిజన వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు జ్యోతి, కార్యదర్శి రాజారావు పాల్గొన్నారు.

జి.మాడుగుల: రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏల చేపడుతున్న మహా ధర్నా మూడవ రోజుకు చేరుకుంది. శుక్రవారం మండలంలో వీవోఏలు వాటి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

**కొయ్యూరులో..**

ఎనిమిది నెలల జీతాభత్యాలతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు దుకాణా సముదాయాల్లో భిక్షాటన కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. సంఘం నాయకులు శోభన్, శాంతకుమారి, చంటిబాబు, పుష్ప, రమణబాబు, భవాని తదితరులు పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** మూడేళ్ల కాల పరిమితిని విరమించుకోవాలని స్థానిక వెలుగు(ఐకేపీ)లో పని చేస్తున్న వీవోఏలు డిమాండ్ చేశారు. ఈ మేరు వారు చేపట్టిన రిలే దీక్షలు ముగిశాయి. ఈసందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు.నాయకులు భాస్కరరావు,జమున,పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలని 104 సిబ్బంది వినతి**

**డుంబ్రిగుడ:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకుడు ఎమ్.జగదీశ్ మాట్లాడుతూ. గత ప్రభుత్వం 104 వాహనాల నిర్వహణను అరబిందో యాజమాన్యానికి అప్పగించడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నామన్నారు. మూడు నెలల వేతనం బకాయిలున్నాయన్నారు. ఈమేరకు నిరసన తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న 104 సిబ్బంది

చింతపల్లి: మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని 104 సిబ్బంది విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉద్యోగులు జీకేవీధి వైద్యాధికారి వినయ్‌కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యంలో పనిచేస్తున్న తమకు వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా ఉన్నదన్నారు. గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104వాహనాలను నిర్వహించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈకార్యక్రంలో ఉద్యోగులు ప్రేమ్‌కుమార్, నజీర్ పాల్గొన్నారు.

## మోదకొండమ్మ భక్తులకు అన్నప్రసాదం వితరణ

పాడేరురూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రప్రజల ఆరాధ్య దైవం పాడేరులో వెలసిన మోదకొండమ్మ సన్నిధిలో శుక్రవారం అన్నప్రసాద వితరణ విజయవంతంగా జరిగింది. ఆలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాన్ని స్వీకరించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక కాంట్రాక్టర్ ప్రభాకరరావు ఆర్థిక సాయం అందించినట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు తెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, దన్నేటిపలాసి రాము, కొణతాల సతీష్, లకే రత్నాబాయి, మహిళా సేవకులు అమరావతి, పద్మ, విశాలమ్మ పాల్గొన్నారు.

## పశుగణనకు రైతులు సహకరించాలి



పశుగణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి నర్సింహులు

పాడేరురూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పశుగణన చేపడుతున్న ఎన్యూమరేషన్ సిబ్బందికి రైతులు సహకరించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సీహెచ్.నర్సింహులు కోరారు. అఖిల భారత 21వ పశుగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్స్ శుక్రవారం మండలంలోని సుండ్రుపుట్టులో చేపట్టిన పశుగణన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు, ఎన్యూమరేటర్స్‌కు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాజీవ్ కిశోర్, పశువైద్య సిబ్బంది వీవీ.రమణ, కె.సురేష్, ఎన్యూమరేటర్ కె.సాయి పాల్గొన్నారు.

## వామగెడ్డకొత్తూరులో తాగునీటి పథకం ప్రారంభం



కొళాయిలను ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వామగెడ్డకొత్తూరులో శుక్రవారం స్థానిక సర్పంచ్, కూటమి నాయకులు మంచి నీటి కుళాయిలను ప్రారంభించారు. గ్రామంలో రూ.7.5లక్షల జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో రక్షిత మంచి నీటి పథకాన్ని నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో నిధుల కొరతవల్ల ఈ పథకం నిర్మాణ పనులకు జాప్యం కలిగింది. తాజాగా కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. దీంతో తాగునీటి సదుపాయం అందుబాటులోకి రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత, వైసీపీ నాయకుడు సింహాచలం, ఉపసర్పంచ్ కరుణానిధి, రాజారావు,నాయకులు బుజ్జిబాబు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

సీలేరు, నవంబరు 8 , (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఎస్ఐ రవీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ విద్య చాలా కీలకమన్నారు. ఈ దశలో వ్యసనాలకు అలవాటుపడకుండా ఉండాలన్నారు. నిరుపేద రైతు కూలీ కుటుంబం నుంచి వచ్చిన తాను ఉన్నత చదువులతో ఎస్ఐ ఉద్యోగం సాధించినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వి. శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీలేరులో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

సీలేరు, నవంబరు 8 , (ఆంధ్ర జ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. సీలేరుకు 3 కిలో మీటర్ల దూరంగా గల జలవిద్యుత్ కేంద్రంలో గతంలో బీఎస్ఎన్ 2 జీ సేవలు మాత్రమే ఉండేవి. ఇవి కూడా అంతంతమా త్రమే. సీలేరులోనూ అదే పరిస్థితి. జలవిద్యుత్ కేంద్రం నుంచి ఎక్కడికైనా ఫోన్ మాట్లాడాలన్నా ఉద్యో గులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. దీంతో ఏపీ జెన్‌కో అధికారులు జలవిద్యుత్ కేంద్రంలో ప్రత్యేకంగా ఒక టవర్ ఏర్పాటు చేయాలని బీఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం స్థానిక జలవిద్యుత్ కేంద్రంలో 4 జీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్, జెన్‌కో సిబ్బంది బీఎస్ఎన్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## పక్కాగృహాల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు: ఏఈ




ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ రమణబాబు

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్టు స్థానిక హౌసింగ్ ఏఈ కె. రమణబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని లంబసింగి పంచాయతీ భీమనాపల్లిలో హౌసింగ్ గ్రౌ ండింగ్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామంలో జన్‌మన్ పథకం ద్వారా 275 పక్కా గృహాలు మంజూరు కాగా, 120మంది పునాదులు, ఎనిమిది మంది స్లాబ్ స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. పునాదులు పూర్తయిన లబ్ధిదారులందరికి తొలివిడత. స్లాబ్‌లు పూర్తిచేసిన లబ్ధిదారులకు రెండో విడత బిల్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజారావు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

గూడెంకొత్తవీధి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని కొయ్యూరు డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీకేవీధి పంచాయతీ వెదురుపల్లి ఎంపీపీ పాఠశాలలో డీటీ సొంత నిధులతో విద్యార్థులు నోట్‌పుస్తకాలు, రాత సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాడెలి దారబాబు, చెల్లయమ్మ, గ్రామ పెద్దలు శాంతరాజు, భవానిపాల్గొన్నారు.

## 'మూడేళ్లగా ఉపాధి పనులకు దూరమైన గిరిజనులు'



ఉపాధి పనులు కల్పించాలని కంపుమానుపాకలులో ఆందోళన చేస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేవీధి గ్రామంలో 28 గ్రామాల గిరిజనులకు మూడేళ్ల ఉపాధి పనులకు దూరమయ్యారని టీడీపీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్ అన్నారు. శుక్రవారం కంపుమానుపాకలు గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే గ్రామాల్లో గిరిజనులకు ఉపాధి పనులు కల్పించడంలేదన్నారు. దీంతో వారు మైదాన ప్రాంతాలకు వలసవెళ్లి కూలిపని చేసుకోవాల్సివస్తుందన్నారు. ఉపాధి హామీ పథంలో గిరిజనులులేనందున 192మంది గిరిజనులకు జన్‌మన్ పక్కా గృహాలు మంజూరైనా బిల్లులు చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ కన్వీనర్ జోగిదొర, గ్రామ పెద్దలు సత్తిబాబు, బాలరాజు పాల్గొన్నారు.

## 'వైసీపీ పాలనలో గిరిజనులకు అన్యాయం'

గూడెంకొత్తవీధి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కుమ్మరివీధిలో గిరిజనులకు అన్యాయం జరిగిందని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు కొయ్యం బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలోని ఈ గ్రామాన్ని జనసేన నాయకులు సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, కొన్నేళ్లుగా వైసీపీకి మాత్రమే ఓటు వేస్తున్నామని, అయినా, ఆ పార్టీ నాయకులు తమ గ్రామానికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకోలేదని వాపోయారు. గ్రామానికి రహదారి, వాగు వద్ద వంతెన నిర్మాణానికి కృషి చేయాలని వాపోయారు. ఈ కార్యక్రమంలో జనసేన సోషల్ మీడియా ఇన్‌చార్జి ఇమ్మానుయేలు, నాయకుడు గొర్లె వీర వెంకట్ పాల్గొన్నారు.


దివ్యాంగ బాలలతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శకుంతల

## ప్రశస్త్ యాప్‌తో దివ్యాంగ బాలల గుర్తింపు

▸▸ సమగ్రశిక్షా సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్ శకుంతల

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రశస్త్ యాప్ ద్వారా దివ్యాంగ బాలల గుర్తింపు కార్యక్రమం వేగవంతం చేయాలని సమగ్రశిక్షా సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్ శకుంతల సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి దివ్యాంగ బాలల బోధన, అభ్యాసన పద్ధతులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రశస్త్ యాప్ ద్వారా గ్రామాల్లోని దివ్యాంగ బాలలను గుర్తించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంఖ్య మరింత పెరగాలని ఆదేశించారు. ప్రభుత్వాల నుంచి వచ్చే అలవెన్సులు, ఇతర సదుపాయాలు దివ్యాంగ బాలలకు అందేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలపై రెవెన్యూ తనిఖీలు

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం గ్రామంలోని వంతెన సమీపంలో ఇసుక అక్రమ నిల్వలను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేశారు. వంతెన సమీపంలో అక్రమంగా సాగుతున్న ఇసుక తవ్వకాలపై గౌరీపట్నం ఎంపీటీసీ సభ్యుడు జగన్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో తనిఖీ చేసి ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలు సాగ కుండా చూడాలని అధికారులకు ఎంపీటీసీ సభ్యుడు జగన్ విజ్ఞప్తి చేశారు.


ఇసుక పోగులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## పొంగలిపాకలో టీడీపీ సభ్యత్వ నమోదు


పొంగలిపాకలో సభ్యత్వ నమోదు పత్రాలు చూపుతున్న నాయకులు, ప్రజలు

మాడుగుల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొంగలిపాక గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, నాయకులు నాయని సత్యనారాయణ తదితరులు సభ్యత్వ నమోదు చేయిస్తున్నారు. సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు.

## నిరక్షరాస్యత నిర్మూలనకు ముందుకురండి

చీడికాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్ష రాస్యత నిర్మూలనకు అందరూ ముందుకు రావాలని ఎంపీడీవో హేమసుంద్రరావు కోరారు. మం డల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్య దర్శులు, వెలుగు వీవోఏలు, ఉపాధి పథకం వీఆర్పీలతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు తెలుసుకునేందుకు అక్షరాస్యత అవసరమన్నారు. మండలంలో ఆరు నెలల కాలంలో 450 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యమని, ఇందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.కనకమ్మ, ఈవోపీఆర్డీ కామేశ్వరరావు, ఉపాధి పథకం ఏపీవో అల్లు మంగునాయుడు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్

## జిల్లాకు 750 గోకులాల షెడ్లు మంజూరు

▸▸ మండల ప్రత్యేకాధికారి రామ్మోహనరావు

మాకవరపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 750 గోకులాల షెడ్లు మంజూరయ్యాయని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి రామ్మోహనరావు తెలిపారు. మండల కేంద్రంలో చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోకులాల షెడ్ల కోసం రైతుల నుంచి 1155 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి అర్హులకు షెడ్లు ఇస్తామన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే పశుగణనను చురుగ్గా చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రామ్మోహన్

## ‘ఉల్లాస్’తో సంపూర్ణ అక్షరాస్యతకు కృషి

▸▸ విద్యా శాఖ ఏడీ చిన్నికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ చిన్నికృష్ణ

కె.కోటపాడు, నవం బరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 15 నుంచి 50 సంవత్సరాల వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ద డానికి కృషి చేస్తున్నామని విద్యా శాఖ ఏడీ బి.చిన్నికృష్ణ చెప్పారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమావేశ మం దిరంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలోగా 50 ఏళ్లలోపు వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మొదటి దశలో 490 మంది సభ్యులను అక్షరాస్యులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.సాంబశివరావు, వెలుగు ఏపీఎం కె.చినబాబు, సీసీలు వెంకటరావు, ఉమామహేశ్వరి, నాయుడు, సత్యనారాయణ, ఏవో అప్పలరాజు పాల్గొన్నారు.

## జీడిమామిడి రైతులు బీమా పథకంలో చేరాలి

▸▸ మండల ఉద్యానవన శాఖాధికారి కిరణ్మయి

కె.కోటపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి రైతులు బీమా పథకంలో చేరాలని ఉద్యానవన శాఖాధికారి కిరణ్మయి చెప్పారు. బీమాలో చేరితే అధిక ప్రయోజనాలు ఉంటాయని, బీమా వల్ల పంట నష్టపోయినా, రైతులకు పరిహారం చెల్లించేందుకు ముందుకురాకపోయినా ఇబ్బంది ఉండదన్నారు. ఎకరానికి రూ.1540 ప్రీమియం చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన సహాయాధికారులు శ్రీనివాసు, కుమార్, రైతులు పాల్గొన్నారు.

# కేటీ పాలెం మార్గం.. ప్రమాదకరం

**కోతకు గురైన రోడ్డు.. ప్రయాణానికి నరకం**

**పట్టని అధికారులు.. వాహన చోదకుల పాట్లు**

దేవరాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వాలాబు-కోణాం మార్గంలో కేటీ పాలెం దాటిన తరువాత ప్రయాణం ప్రమాదకరంగా పరిణమించింది. ఈ రహదారి ఆద్యంతం కోతకు గురైంది. ఇది ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేదు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

దేవరాపల్లి నుంచి చీడికాడ మండలం కోణాం వాలాబు మీదుగా 17 కిలోమీటర్లు దూరం ఉంటుంది. వాలాబు నుంచి కోణాంకు ఏడు కిలోమీటర్లు. పాడేరు, మాడుగుల వెళ్లడానికి ఈ మార్గం అతి తక్కువ దూరం కావడంతో చాలా మంది ఇలానే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే అనంతగిరి మండంలోని జీనబాడు పంచాయతీకి చెందిన బెంబి గిరిజన గ్రామం ప్రజలు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారు. వారు కూడా ఈ మార్గంలోన రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి పలుచోట్ల కోతకు గురైంది. గొడుగు మామిడి, జాజుల పాలెం, చెరుకుపల్లి కలుపుతూ ఈ రోడ్డు ఉపయోగపడుతోంది. అయితే గొడుగుమామిడి సమీపంలో పలు చోట్ల రోడ్డు, మదుములు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వాలాబు సందర్శించిన సమయంలో ఈ రోడ్డుకు అటవీ శాఖ అధికారులు రిజర్వు ఫారెస్టు భూములు అడ్డంకిగా ఉన్నట్టు వాలాబు సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సమస్య పరిష్కరించి రోడ్డు అభివృద్ధికి చొరవ తీసుకోవాలని కోరారు.


వాలాబు-కోణాం రహదారిలోని కేటీ పాలెం వద్ద పూర్తిగా కోతకు గురైన రహదారి

# చాకలి చెరువు పూడ్చివేత చర్యలపై రైతుల ఆగ్రహం

▸▸ గుడ్డిప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తీరుపై అసహనం

రావికమతం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగునీరందించే చాకలి చెరువు గెడ్డను వ్యర్థాలతో పూడ్చివేస్తుండడంపై రైతులు మండిపడ్డారు. గుడ్డిప గ్రామ సర్పంచ్ గుమ్మాల గణేశ్వరావు, కార్యదర్శి నరసింగరావుల తీరుపై ఆయకట్టు రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గెడ్డ పూడ్చివేతపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రైతులు మజ్జి అప్పారావు, పిల్లా రమణ, గల్లా నానిబాబు, యన్నంశెట్టి సత్తిబాబు, మజ్జి నాగేష్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. గుడ్డిప గ్రామ చాకలి చెరువు నుంచి పలువురు రైతుల పంట పొలాల మీదుగా గొంప అల్లం చెరువు వరకూ గెడ్డ పూర్వీకుల నుంచి ఉందన్నారు. ఈ గెడ్డ ద్వారా చాకలి చెరువు ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అయితే ఈ గెడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆనుకొని ఉందన్నారు. గ్రామంలో రోజు ఊడ్చిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లతో సర్పంచ్, కార్యదర్శులు ఈ గెడ్డను ఆనుకు వేయిస్తున్నారని, పెద్ద కుప్ప అయ్యాక ఎక్స్‌కవేటర్‌తో గెడ్డలోకి తోసివేసి పూడ్చి వేస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో గెడ్డ కుచించుకుపోయి పైన చాకలి చెరువు నుంచి తమ ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని వాపోయారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ విషయమై కార్యదర్శి నరసింగరావును వివరణ కోరగా, గెడ్డనైతే పూడ్చలేదని, పేరుకుపోతున్న చెత్త కుప్పలతో ఖాళీ స్థలంలోనే వేసి చదును చేస్తున్నామని చెప్పారు.


ఎక్స్‌కవేటర్‌తో వ్యర్థాలు పడవేయడంతో పూడుకుపోతున్న చెరువు గెడ్డ

## వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వీవోఏలు శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసం వద్దకు చేరకుని నిరసన తెలిపారు. వీవోఏలను మూడు సంవత్సరాల తర్వాత తొలగించాలని ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఐదు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, యూనిఫామ్ మంజూరు చేయాలని కోరారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు విదేశీ పర్యటనలో వుండడంతో ఆయన భార్య పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు బుజ్జి, పద్మ, అన్నపూర్ణ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేయాలి

రోలుగుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలకు జారీ చేసిన మూడేళ్ల కాల పరిమతి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఏపీఎం ఉషాదేవికి వినతిపత్రం వైసీపీ ప్రభుత్వం 2019 ఈ సర్క్యులర్‌ను తెచ్చిందని, దీనివల్ల 15 ఏళ్లగా ఇదే ఉపాధిపై ఆధారపడిన వారంతా రోడ్డునపడతారని పేర్కొన్నారు. ఈ సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు వీవోఏలు సామిరెడ్డి జ్యోతి, అరుణ, మణి, నాగేశ్వరారరావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై 104 ఉద్యోగుల వినతి

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ అధికారికి 104 ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. 104 సేవలను పీహెచ్‌సీ వైద్యాధికారుల ద్వారా అమలయ్యేలా చూడడంతో పాటు సిబ్బంది నుంచి అరబిందో సంస్థ అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్ము తిరిగి వెనక్కి ఇప్పించేలా చూడాలని కోరారు. అలాగే ఉద్యోగులకు అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు కూడా చూడాలని వారు విన్నవించారు.

## అర్హులందరికీ ఉచిత సిలిండర్

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత సిలిండర్ అందుతుందని, వినియోగదారులు అనవసరంగా ఆందోళన చెందనవసరం లేదని తహసీల్దార్ అంబటి రామారావు శుక్రవారం తెలిపారు. దీపం, ఉజ్వల-1, ఉజ్వల-2, సీఎస్‌ఆర్ ఫ్రీ, సాధారణ తెల్లకార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ ఉన్నవారందరికీ ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందన్నారు. ఆరంచెల వడపోతలో అనర్హులుగా తేలిన వారికి ఉచిత గ్యాస్ వర్తించదని, అటువంటి వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే విచారణ అనంతరం ఉచిత గ్యాస్ అందిస్తారని చెప్పారు. అలాగే ఇళ్ల వద్దనే గ్యాస్ డెలివరీ సిబ్బంది వచ్చి ఉచితంగా ఈకేవైసీ నిర్వహిస్తారని చెప్పారు.

## నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల నమోదు

కె.కోటపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 61 పోలింగ్ బూత్‌ల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ పి.భాగ్యవతి చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులందరూ పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు హక్కు కోసం దరఖాస్తులను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ పి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## కొంగశింగిలో ధ్వజ స్తంభం ఏర్పాటు

కృష్ణాదేవిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కొంగశింగి గ్రామానికి వెళ్లే ముఖద్వారం వద్ద నిర్మించిన శివాలయం ఎదుట శుక్రవారం గ్రామస్థులు 30 అడుగుల ధ్వజ స్తంభాన్ని గ్రామ మాజీ సర్పంచ్ చెల్లూరి సత్యనారాయణ, సత్యవతి దంపతులు, గ్రామస్థుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, ఎంపీటీసీ మాజీ సభ్యులు లగుడు శ్రీను, సత్యవతి, కూటమి నాయకులు వరహాలమూర్తి, మణిబాబు, మరిడిబాబు, వెంకటరమణ, మల్లేశ్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## 11న జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

మాడుగుల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ పి.శిరీషారాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు కంపెనీలతో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం నిరుద్యోగ యువత ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పది నుంచి పీజీ వరకు చదువుకుని 18 నుంచి 35 ఏళ్ల వారు ఇందుకు అర్హులని, పూర్తి వివరాలకు 7981102224 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# రీ సర్వేలో తప్పులను సరిచేయండి

▸▸ రెవెన్యూ సదస్సులో రైతుల వినతులు

నాతవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని రైతులు వినతులు అందించారు. రామ చంద్రరాజు అగ్రహారంలో సర్వే నంబరు-1, సర్వే నంబరు 3-3లో 40 ఎకరాల జిరాయితీ భూములను అధికారులు గయ్యాళి భూమిగా (ఎవ్వరూ సాగులో లేరని) నమోదు చేశారని వారు విన్నవించారు. మండలంలోని చినగొలుగొండపేట గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ 2023లో రీ సర్వే చేసినప్పుడు తప్పులు ఉంటే సరిచేస్తామని, రైతులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు జిరాయితీ భూములను గయ్యాళి భూములుగా నమోదు చేశారని, ఈ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. 2018 వరకు ఈ భూములకు రిజిస్ట్రేషన్ అయ్యాయని, 1987లో ఏలేరు కాలువ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చిందని, ఇటువంటి జిరాయితీ భూములను 2023లో రీసర్వే చేసినప్పుడు గయ్యాళి భూములుగా అధికారులు నమోదు చేయడమేమిటని రైతులు ప్రశ్నించారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. చినగొలుగొండపేట గ్రామంలో రైతుల భూముల విస్తీరణం, పేర్లు తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే పాసుపుస్తకాలు ఉన్న వ్యక్తులు చనిపోతే వారి వారసులకు పాసుపుస్తకాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. కొందరు గెడ్డలు చెరువులను అక్రమించుకుని సాగు చేస్తున్నారని, వారికి పాసుపుస్తకాలు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సిహెచ్.రామకృష్ణ టీడీపీ నాయకులు మిరపల దొరబాబు, కె.జమీలు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతులు అందిస్తున్న మాజీ జడ్పీటీసీ, రైతులు

## ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్డు తొలగింపుపై ఉద్రిక్తత

రావికమతం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ కొత్తకోటలో శుక్రవారం ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న రేకుల షెడ్డు తొలగింపుపై ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో రెండో వార్డులో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో గ్రామానికి చెందిన జనప రెడ్డి అప్పారావు కొంత కాలంగా పూరి గుడిసే వేసి ఒంటరిగా జీవిస్తున్నాడు. రెండు రోజులుగా పూరి గుడిసె స్థానంలో మళ్లీ రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాడు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు రేకుల షెడ్ తొలగింపునకు చర్యలు చేట్టారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న రేకులు తొలగించాలని, ఇంటి బయటకు వెళ్లాలని జనపరెడ్డి అప్పారావును పంచాయతీ అధికారులు ఆదేశించారు. రెక్కడితేనేగాని డొక్కాడని బతుకు తనదని, తల దాచుకోవడానికి గత్యంతరం లేక ప్రభుత్వ స్థలంలోనే రేకుల షెడ్ నిర్మించుకుంటున్నానని అప్పారావు పంచాయతీ అధికారుల వద్ద ప్రాధేయపడ్డాడు. అయినప్పటికీ షెడ్డును తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్న సమయంలో స్థానిక ప్రజలు అప్పారావుకు మద్దతుగా అధికారులకు ఎదురు తిరిగారు. ఇదే స్థలంలో పలువురు అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఎందుకు మిన్నకుంటున్నారని ప్రశ్నించారు. బడా నాయకుల అక్రమ కట్టడాలను ముందు తొలగించాలని పంచాయతీ అధికారులకు గ్రామస్థులు డిమాండ్ చేశారు. దీంతో దిక్కుతోచక వారు వెనుతిరిగారు. వాస్తవానికి అప్పారావు ఇల్లు నిర్మించుకున్న స్థలం గ్రామ కంఠంలోకి రాదని, దీనిపై రెవిన్యూ అధికారులు వచ్చి వాస్తవం తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బాధితుడికి మద్దతుగా అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

## చినపాచిలను మోడల్ పంచాయతీగా అభివృద్ధి చేస్తాం

రావికమతం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చినపాచిలను మండలంలోనే మోడల్ పంచాయతీగా అభివృద్ధి చేస్తామని గ్రామ సర్పంచ్ కోమటి రామలక్ష్మి శంకరావు, ఎంపిటీసీ సభ్యురాలు ముచ్చకర్ల గంగా భవానీ అన్నారు. ఈ మేరకు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం వారు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో కింతలి రోడ్డు నుంచి కోమటి సత్యవతి ఇంటి వరకు, ఆంజనేయస్వామి గుడి నుంచి నక్కా రామస్వామి నాయుడు ఇంటి వరకు సీసీ రోడ్లు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు ఆడాడ రాజారావు, సీపీఎస్ మాజీ అధ్యక్షులు కోన పరదేశి నాయుడు, టీడీపీ నాయకులు సాసుబిల్లి నాయుడు, ముచ్చర్ల ధనుజయ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

## సెయింట్ ఆన్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి సెయింట్ ఆన్స్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్కూల్ ఎంతో మంది విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తును అందించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పద్మావతి, రాజునాయుడు, కరస్పాండెంట్ అగష్యాన్ మేరీ, ప్రిన్సిపాల్ ఎం.రజిల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం క్విజ్ పోటీలు నిర్వహిస్తామని, ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఒక బృందంగా పాల్గొనాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ కోరారు. ఈ నెల 14 బాలల దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

## ఐలాజ్ మహాసభను విజయవంతం చేయండి

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) మొదటి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ శేషాద్రి సదన్‌లో వచ్చే నెల 8న జరుగుతున్న ఈ సభకు అందరు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలాజ్ కన్వీనర్ బుగత శివ, కన్వీనింగ్ కమిటీ సభ్యురాలు ఎ.దేవీ, బార్ అసోసియేషన్ కార్యదర్శి శివకృష్ణ, సీనియర్ న్యాయవాదులు పి.నరసింహ, సిహెచ్.స్వామి నాయుడు, సుర్ల కన్నయ్యనాయుడు, విజయ ప్రసాద్, కె.రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

## వీఆర్‌వోను సస్పెండ్ చేయాలి

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్‌వో లక్షణరావును సస్పెండ్ చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగులు ప్రభుత్వ పారదర్శక పాలను కట్టుబడి ఉండాలని సూచించారు. లంచం తీసుకున్న వీఆర్‌వో కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కొరువాడలో ఎక్సైజ్ దాడులు

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కె.కోటపాడు మండలం కొరువాడ ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడి చేసి 1400 లీటర్ల బెల్లం పులుసు, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పాపునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి నాటుసారా తయారు చేయవద్దని, వాటిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్ఐ శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

## 75 మద్యం సీసాలు సీజ్

అక్రమంగా తరలిస్తున్న 75 మద్యం సీసాలను గౌరీపట్నం జంక్షన్ వద్ద శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కె.పాపునాయుడు చెప్పారు. గౌరీపట్నం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం సీసాలతో వెళ్తూ పట్టుబడ్డారని ఆయన చెప్పారు.

## 17న మండల సమావేశం

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీవీఎస్.ఆంజనేయులు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చదవడం, రాయడం నేర్చుకోండి

నర్సీపట్నం అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ చదవడం, రాయడం నేర్చుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ పాల్గొన్నారు.

## విద్యార్థులు మొక్కలు నాటాలి

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు నాడు ప్రతీ విద్యార్థి ఓ మొక్క నాటాలని జిల్లా అటవీ అధికారి శామ్యూల్ సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నర్సీపట్నం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీజీనాథ్ పాల్గొన్నారు.

## జోగంపేటలో గ్రామసభ

గొలుగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సూర్యమణి మాట్లాడుతూ ఉపాధి పనుల గుర్తింపు కోసమే సభలు నిర్వహిస్తున్నామన్నారు. 2025-26 సంవత్సరంలో వివిధ పనుల కోసం ప్రజలు, రైతులు దరఖాస్తులు అందించాలన్నారు. ఈ నెల 20 నుంచి జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పనులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ రాధిక, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

## కొత్తకోటరాజువీధిలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

రావికమతం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటరాజువీధిలో డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ కోన లోవరాజు శుక్రవారం భూమి పూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ డ్రైనేజీ నిర్మిస్తున్నట్టు ఈ సందర్భంగా సర్పంచ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, వార్డు సభ్యుడు దివాకర్ పాల్గొన్నారు.

## ‘ఉల్లాస్’పై అవగాహన అవసరం

రోలుగుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ పథకంపై అవగాహన అవసరమని వెలుగు ఏపీఎం ఉషాదేవి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు ఈ పథకంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. నిరక్షరాస్యులను గుర్తించి ప్రతీ రోజు రాత్రి రెండు గంట పాటు బోధించాలని చెప్పారు. అలాగే డిజిటల్ విద్య, బ్యాంకు లావాదేవీలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు.

# ఈత కొట్టు... ఆరోగ్యం పట్టు!

స్విమ్మింగ్‌తో చక్కని శరీర సౌష్ఠవం





**ఆరోగ్యమే మహా భాగ్యం. సరైన ఆహార అలవాట్లు, తగినంత విశ్రాంతి, క్రమం తప్పని వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. ఇందులో వ్యాయామం పాత్ర ఎక్కువ. జిమ్‌కి వెళ్లడం, వాకింగ్, రన్నింగ్, యోగా, ఏరోబిక్స్ తదితర అంశాలు ఆరోగ్యానికి దోహదపడేవే. అయితే వీటన్నింటికీ భిన్నంగా మరింత మెరుగైన ఆరోగ్యంతో పాటు ఆనందాన్నిచ్చేది స్విమ్మింగ్.** - విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి

వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితిలో ఈత కొడితే ఆ హాయే వేరు. ఈత అద్భుత శారీరక వ్యాయామమని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొంది. వారంలో కనీసం 40 నిమిషాల నుంచి గంట సమయం ఈతకు కేటాయిస్తూ కనీసం మూడు నెలలు పాటించగలిగితే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఓ అధ్యయనం తేల్చింది. ఈత కొట్టడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యానికి మేలు జరుగుతుందని, కేన్సర్, డయాబిటిస్, డిప్రెషన్, హార్ట్ సమస్యలు, ఎముకల సంబంధిత వ్యాధుల తీవ్రతను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### ఈత కొట్టే విధానాలివి...

తరచూ స్విమ్మింగ్ చేయడం వల్ల శరీరంలోని అనేక కండరాల్లో చురుకుదనం వస్తుంది. స్విమ్మింగ్‌లో సాంకేతికంగా తేడాలుంటాయి. శరీర భాగాల సమన్వయంతో, లయబద్ధంగా కదలికలుంటాయి. మొండెం, చేతులు కాళ్లు, పాదాలను పలురకాలుగా వినియోగించాల్సి ఉంటుంది. ఫ్రీస్టైల్ విధానంలో ఎలా అయినా ఈత కొట్టేందుకు వీలుంటుంది. బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఛాతీ నుంచి బలాన్ని ప్రయోగించాలి. బటర్ ఫ్లై స్టైల్‌లో శరీరంలోని భాగాలన్నీ వినియోగించాలి. సైడ్ స్ట్రోక్‌లో ఒక చేయి ఎప్పుడూ నీటిలో ఉంచి, మరో చేతిని ఉపయోగించి స్విమ్మింగ్ చేయాలి. ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో చాలాసేపు ఈత కొట్టాలంటే పొత్తి కడుపు (కోర్ అబ్డామినల్), శరీర భాగం మరో వైపు తిప్పడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. హిప్ ఫ్లెక్సర్ కాంపాక్ట్ స్థిరమైన కిక్‌కు ఉపయోగపడుతుంది. ఫ్రీ స్టైల్ బ్యాక్ స్ట్రోక్ స్విమ్మింగ్‌లో ఈతగాళ్లు తమ వీపుపైన పడుకుని ఈత కొట్టాలి. చేతులను కాళ్లను



## నిత్యం ఫిట్‌గా ఉండేందుకు దోహదం

### దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసే వ్యాయామం

తిరుగుతున్నట్టుగా కదిలించాలి. ఇందులో వెల్లికిల్లా పడుకుని వెనుకకు తిరిగి ఈత కొట్టాల్సి ఉంటుంది. వెన్ను సమస్యలతో బాధపడేవారికి ఈ పద్ధతి దోహదపడుతుంది.

### బటర్‌ఫ్లై స్ట్రోక్‌తో వెయిట్ లాస్

బటర్ ఫ్లై స్ట్రోక్‌తో వెయిట్ లాస్ అవుతుంది. రోజూ పది నిమిషాలు చేస్తే సుమారు 140 క్యాలరీలు ఖర్చవుతాయి. పెక్స్, లాస్ట్, క్వాడ్‌లు, భుజాలు, బైసిప్స్ ట్రైసెప్స్‌కు సంబంధించిన అన్ని కండరాలు పనిచేస్తాయి. తల నీళ్లలోంచి, శరీరం నిటారుగా ఉండాలి. చేతులు, కాళ్లను కప్పలు నీటిలో ఈదుతున్నట్టుగా ఉపయోగించాలి. పెక్టోరల్, లాటిస్సిమస్ డోర్సీ కండరాలు నీటికి వ్యతిరేకంగా చేతులను లోపలకు తిప్పడానికి ఉపయోగించాల్సి ఉంటుంది. బ్రెస్ట్‌స్ట్రోక్ కిక్ ఇవ్వడంలో గ్లూట్స్‌తో పాటు క్వాడ్రిసెప్స్ కండరాలను ఉపయోగించాలి.

### ఊపిరితిత్తులకు మేలు

రన్నర్స్‌లో కంటే స్విమ్మర్స్‌లో ఊపిరితిత్తుల పనితీరు బలపడుతుందని ఫిజియాలజిస్టులు పేర్కొంటున్నారు. ఆక్సీజన్ పరిమాణాన్ని పెంచడంలో కీలకంగా మారుతుందన్నారు. స్విమ్మింగ్ చేసేటప్పుడు ఊపిరితిత్తులు చాలా చురుగ్గా పనిచేస్తాయి. లోతైన శ్వాసను తీసుకోవడం, ఎక్కువసేపు బిగపట్టడంతో ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. శ్వాస సామర్థ్యం పెరుగుతుంది. ఈ వ్యాయామాలతో ఆస్తమా రోగులకు కూడా మేలు జరుగుతుంది.

### మానసిక ఆనందానికి ...

ఈతతో మంచి అనుభూతిని కల్గించే హార్మోన్లు ఎండార్ఫిన్‌లను పెరుగుతాయి. ఒత్తిడి హార్మోన్లు, అడ్రినలిన్, కార్టిసాల్‌లను తగ్గిస్తుంది. మానసిక స్థితి, ఆందోళన, ఒత్తిడి, నిరాశ, డయాబిటిస్ నియంత్రించడానికి ఉపయోగపడుతుంది.



కీళ్ల నొప్పులు, గుండె జబ్బుల నివారణకు దోహదపడుతుంది. రాత్రివేళ మంచి నిద్ర పడుతుంది. మహిళలు ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు స్విమ్మింగ్ చేస్తు గుండె సంబంధిత వ్యాధులకు పూర్తిగా దూరమయ్యే అవకాశం ఉంది.

### ఇవి పాటించాలి

ఈత రాని వారు ట్రైనర్ సహాయం తీసుకోవాలి. ఈతకు వెళ్లేటప్పుడు నాణ్యమైన గాగుల్స్ తలకు టోపీ ధరించాలి. ముందుగా స్నానం చేసిన తర్వాత మాత్రమే స్విమ్మింగ్ పూల్‌లోకి ప్రవేశించాలి. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ స్నానం చేయాలి. స్విమ్మింగ్ చేసేటప్పుడు శరీరం డీహైడ్రేట్ అవుతుంది. కానీ ఆ సమయంలో చెమట కనిపించదు. కాబట్టి నీటిని అవసరమైన పరిమాణంలో తీసుకోవాలి. సన్‌బర్న్, టానింగ్ నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య స్విమ్మింగ్ చేయకపోవడం మంచిది. చర్మం, జుట్టు పొడిబారకుండా ఉండాలంటే వాటర్ ప్రూఫ్ మాయిశ్చరైజర్లు వినియోగించాలి. ఈత కొట్టడానికి వెళ్లేటప్పుడు పరిశుభ్రమైన స్విమ్మింగ్ పూల్‌ని ఎంచుకోవాలి. పూల్ నిర్వహణపై సమగ్ర వివరాలు సేకరించాలి. ఈతకు శక్తి అవసరం. అందుకు తగ్గ ఆహారాన్ని తీసుకోవాలి. కండరాలలో అసౌకర్యంగా అనిపిస్తే ట్రైనర్ సలహా మేరకు స్విమ్మింగ్ చేయాలి.

## కాలినడకన శబరిమలకు..



నడుచుకుంటూ శబరిమల వెళుతున్న అయ్యప్ప మాలధారణ భక్తులు

కశింకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని మురళీనగర్ ప్రాంతానికి చెందిన నలుగురు అయ్యప్పమాలధారులు కాలి నడకన శబరిమలకు బయలుదేరారు. వీరు శుక్రవారం కశింకోట మండలం మీదుగా తమ ప్రయాణాన్ని సాగించారు. బిల్లంగి శ్రీనివాసరావు, వై.వెంకట్రావు, ఎస్.హరికుమార్, కె.తులసీరమేశ్ గురువారం విశాఖపట్నంలోని పీఠం వద్ద నుంచి పాదయాత్రను ప్రారంభించారు. రోజూ సుమారు 40 కిలోమీటర్లు నడక సాగించి, సమీపంలోని ఏదో ఒక ఆలయంలో ఆశ్రయం పొందాతామని చెప్పారు. విశాఖ నుంచి శబరిమలకు 1,650 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందని తెలిపారు.

## జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా రవికుమార్



బి.రవికుమార్

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారిగా (ఎఫ్ఏసీ) బి.రవికుమార్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మార్కెట్ కమిటీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. వారంలో మూడు రోజులు అనకాపల్లిలో, మరో మూడు రోజులు అనపర్తిలో విధులు నిర్వహిస్తారు. కాగా అనకాపల్లి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారిగా పనిచేసిన రవికిరణ్‌ను ప్రభుత్వం విజయనగరానికి బదిలీ చేసింది.

## డీఎస్సీ కోచింగ్ ప్రవేశాల స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

అనకాపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ కోచింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ నెల 10వ తేదీన నిర్వహించాల్సిన స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా పడిందని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో వుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 107.00 |
| లైవ్ ధర | 123.00 |
| విత్ స్కిన్ | 224.00 |
| స్కిన్ లెస్ | 234.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |



## రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం



బాలికల జట్ల మధ్య సాగుతున్న హాకీ పోటీ

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల హాకీ పోటీలు శుక్రవారం ఇక్కడ ప్రారంభం అయ్యాయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో తొలిరోజు బాలురు విభాగంలో కర్నూలు జట్టుపై తూర్పుగోదావరి జట్టు, శ్రీకాకుళంపై గుంటూరు, కృష్ణాపై నెల్లూరు, పశ్చిమ గోదావరిపై అనంతపురం విజయం సాధించాయి. ప్రకాశం-విజయనగరం జట్ల మధ్య పోటీ టైగా ముగిసింది. బాలికల విభాగంలో నెల్లూరుపై కృష్ణా, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జిల్లా జట్లు గెలుపొందాయి. విజయనగరం-కర్నూలు, చిత్తూరు-ప్రకాశం, పశ్చిమ గోదావరి -గుంటూరు జట్ల మధ్య మ్యాచ్‌లు టైగా ముగిశాయి. అంతకుముందు హాకీ పోటీలను డీఈవో జి.అప్పారావు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యం నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఏనుగుపల్లి రత్నం, గోసల కాసులమ్మ, వీసం నానాజీ, జయరత్నకుమారి, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, టీఎస్ హాకీ క్లబ్ ప్రతినిధులు సూరిబాబు, కొల్నాటి తాతాజీ, పలు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్చరీ జాతీయస్థాయి పోటీలకు అరకులోయ విద్యార్థులు





జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి

అరకులోయ, 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రీడా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలు ఆర్చరీ పోటీలు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగింపేటలో జరిగాయి. అండర్-14 విభాగంలో అరకులోయ క్రీడా పాఠశాలకు చెందిన వి.లలిత్ సాయితేజ్, అండర్- 17 విభాగంలో ఎస్.జే.ప్రసాద్, డి.గౌతమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 10వ తేదీ నుంచి గుజరాత్‌లోని నడియాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

## విమానాశ్రయంలో యాంటీ హైజాక్ ఎక్సర్‌సైజ్



హైజాక్‌ను అడ్డుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో తూర్పు నౌకాదళం అధికారులు యాంటీ హైజాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. విమానాశ్రయంలో అనుకోకుండా హైజాకింగ్ వంటి ఘటనలు సంభవిస్తే సంబంధిత సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉన్నారో తెలుసుకోవడానికి, లోపాలు ఉంటే సరిచేసుకోవడానికి దీనిని నిర్వహించినట్టు తూర్పు నౌకాదళం తెలిపింది. ఈ కార్యక్రమం బుధవారం నిర్వహించామని, అందులో సీఐఎస్ఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు పాల్గొన్నాయి.

## సాంకేతిక నైపుణ్యంతో సైబర్ నేరాలకు చెక్

... 5వ పేజీ తరువాయి

బదిలీని ఆపి, వెనక్కు రప్పించే అవకాశం వుంటుందన్నారు.

అనకాపల్లి జిల్లాలో సైబర్ నేరాలకు సంబంధించి ఇప్పటి వరకు ఒక కోటి 20 లక్షల రూపాయలను ఫ్రీజ్ చేశామని, సంబంధిత కోర్టుల ద్వారా త్వరలో బాధితులకు అందజేస్తామని ఎస్పీ చెప్పారు. రానున్న రోజుల్లో చోరీల కన్నా సైబర్ మోసాల ద్వారా ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు పోగొట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రూపాల్లో జరిగే సైబర్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దర్యాప్తు అధికారులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు సైబర్ నిపుణులు సాయి రామానుజ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం చేపట్టామన్నారు. సైబర్ మోసాలు, నేరాల కేసులను దర్యాప్తు చేసే అధికారులు ఈ శిక్షణ ద్వారా సాంకేతికత నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని భవిష్యత్తులోసైబర్ క్రైమ్‌కు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ తుహీన్ సిన్హా పిలుపునిచ్చారు.

సైబర్ నిపుణులు సాయిరామానుజ మాట్లాడుతూ, సైబర్ మోసాలను ఛేదించడం చాలా సులువని, దర్యాప్తు అధికారులకు ఇందుకు అవసరమైన అవగాహన, వృత్తి నైపుణ్యంఅవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ టి.కల్యాణి, ఐటీ కోర్ ఎస్ఐ బి.సురేశ్‌బాబు, రెండు జిల్లాలకు చెందిన పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## రైలు నుంచి దిగుతూ..

» బోగీకి, ప్లాట్‌ఫారానికి మధ్య ఇరుక్కుపోయి తీవ్రగాయాలు



ప్లాట్‌ఫారంపై బాధిత ప్రయాణికుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచి శుక్రవారం రాత్రి ఓ ప్రయాణికుడు అనకాపల్లిలో స్టేషన్‌లో రైలు దిగుతూ ప్లాట్‌ఫారానికి, బోగీకి మధ్య చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే అధికారులు, స్థానికులు ప్లాట్‌ఫారంపై రెండు టైల్స్ తొలగించి క్షతగాత్రుడిని బయటకు తీశారు. నడుము వద్ద బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యశాలకు తరలించారు. ఇతను రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా ఆయన వద్ద ఉన్న ఆధార్ కార్డు ద్వారా రైల్వే పోలీసులు గుర్తించారు.

## బైకులు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన సూర్యనారాయణ

దేవరాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందగా, అతని కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. దేవరాపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.కోటపాడు పోలీసులు శుక్రవారం సాయంత్రం దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల సరిహద్దులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఎస్.కోటకు చెందిన ఇద్దరు యువకులు భయంతో తమ వాహనాన్ని దేవరాపల్లి వైపు మళ్లించారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొన్నారు. దీంతో అనకాపల్లికి చెందిన శరగడం సూర్యనారాయణ(60) తీవ్రంగా గాయపడగా, బైక్ నడుపుతున్న ఆయన కుమారుడు వెంకటేశ్‌కు గాయాలయ్యాయి. సూర్యనారాయణను కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మృతిచెందాడు. వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 60 కిలోల గంజాయి స్వాధీనం

ముంచంగిపుట్టు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోడిపుట్టు జంక్షన్ వద్ద 60 కిలోల గంజాయి పట్టుకున్నట్టు ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారంతో దోడిపుట్టు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామని, ఈ సమయంలో ద్విచక్ర వాహనాలపై వస్తున్న వ్యక్తులు తమను చూసి గోనె సంచులను విడిచి పరారయ్యేందుకు ప్రయత్నించారని చెప్పారు. పోలీసులు వెంబడించి ఒకరిని పట్టుకోగా, నలుగురు పారిపోయారన్నారు. గోనె సంచులను పరిశీలించగా 60 కిలోల గంజాయి లభించిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైం... crime news

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

విశాఖపట్నం (లీగల్)/ కొయ్యూరు నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒక హత్య కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ముద్దాయిల్లో ఇద్దరికి రూ.60 వేలు చొప్పున, ఒకరికి రూ.30 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు, కొయ్యూరు సీఐ వెంకటరమణ అందించిన వివరాలిలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూదరాళ్ల పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కొర్ర బొజ్జయ్య, గిడుతూరి సింహాచలానికి, అదే గ్రామానికి చెందిన గెమ్మెలి రాంబాబు, గెమ్మెలి శ్రీను, పాంగి బుజ్జిబాబుల మధ్య భూ తగాదాలు వున్నాయి. ఈ నేపథ్యంలో 2010 మార్చి 13వ తేదీన గెమ్మెలి రాంబాబు, గెమ్మెలి శ్రీను, పాంగి బుజ్జిబాబులు కర్రలు, కత్తులతో గిడుతూరి సింహాచలం, కొర్ల బొజ్జయ్యలపై దాడిచేశారు. ఈ సంఘటనలో బొజ్జయ్య మృతిచెందగా, సింహాచలం తప్పించుకుని పారిపోయాడు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు మంప పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నేరాభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు శిక్ష విధిస్తూ విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తీర్పు చెప్పారు.

## గంజాయి కేసులో ముద్దాయికి 10 ఏళ్ల జైలుశిక్ష

» రూ.లక్ష జరిమానా.. చెల్లించని పక్షంలో మరో రెండున్నరేళ్లు కారాగారవాసం

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ.రత్నకుమార్ తీర్పు ఇచ్చారు. చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన గాడి శ్రీను 2015 జనవరి 17న గంజాయి రవాణా చేస్తూ, చీడికాడ పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతని నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అప్పటి ఎస్ఐ డి.విశ్వనాథం కేసు నమోదు చేశారు. నిందితుడిపై పోలీసులు మోపిన నేరం రుజువుకావడంతో జడ్జి రత్నకుమార్ పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నర సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసును పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు వాదించారు. ముద్దాయికి శిక్ష పడేలా బలమైన ఆధారాలతో ఛార్జిషీటు దాఖలు చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

## 40 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు



పోలీసులు పట్టుకున్న కార్లు, గంజాయితో నిందితులు

దేవరాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండు కారుల్లో తరలిస్తున్న 40 కిలోల గం జాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ మల్లికార్జునరావు తెలి పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి దేవరాపల్లి మీదుగా రెండు కార్లలో గంజాయి తరలిస్తున్నట్టు గురువారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. దీంతో శ్రీరాంపురం వై జంక్షన్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిఘా పెట్టారు. కొద్దిసేపటి తరువాత వచ్చిన రెండు కార్లను తనిఖీ చేశారు. ఒక కారులో 38 కిలోలు, మరో కారులో రెండు కిలోల గంజాయి పట్టుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఫనస్క్ కురంగాట్, సల్మాన్ ఫారిస్, మహ్మద్ ఫిజాష్, శరుణ్ షాజీలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. మరో నిందితుడు విఘ్నేష్ అలియాస్ విక్కీ పరారయ్యాడు. ఇతను కొంత కాలంగా అరకులోయలో నివాసం ఉంటున్నాడు. నిందితులను చోడవరం కోర్టులో హాజరపరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

## రెండు టన్నుల రేషన్ బియ్యం సీజ్



ఆటోల్లో సీజ్ చేసిన రేషన్ బియ్యం

దేవరాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నారు. దేవరాపల్లి నుంచి రెండు ఆటోల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు శుక్రవారం తెల్లవారుజామున అధికారులకు సమాచారం అందింది. దీంతో విజిలెన్స్ అధికారి రవికుమార్, పౌరసరఫరాల అధికారి సాయిరాం, సిబ్బందితో వెళ్లి మారేపల్లి సమీపంలో ఆటోలను అడ్డగించారు. వీటిల్లో 40 బియ్యం బస్తాలు (సుమారు రెండు టన్నులు) స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని పౌరసరఫరా గోదాముకు తరలించి, ఆటోలను పోలీసులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న ఆటోల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు.